Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 116 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 మే 2023 గురువారం పేజీలు : 4

## ఎల్ఐసీ నష్టానికి మోదీ బాధ్యత వహిస్తారా?: కాంగ్రెస్

దిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంలాంటి జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి అదానీ గ్రూపు సంస్థల్లో ఉన్న వాటాల విలువ పడిపోయిందనీ, నష్ట ప్రమాదం ఉన్న సంస్థలో పెట్టుబడులు పెట్టేలా ఎల్ఐసీని ఒత్తిడి చేసింది ఎవరని కాంగ్రెస్ పార్టీ ఎన్డీయే సర్కారును నిలదీసింది. అదానీ సంస్థల్లో ఎల్ఐసీ వాటా విలువ రూ. 52,000 కోట్ల మేరకు హరించుకు పోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. దీనివల్ల కోట్లమంది పాలసీదారుల లాభమంతా తుడిచి పెట్టుకుపోయిందని చెప్పారు. ప్రజాధనంతో జూదమాడినందుకు ప్రధాని మోదీ బాధ్యత వహిస్తారా అని నిలదీశారు. విదేశీ సంస్థలు అదానీ గ్రూపు అక్రమాలపై దృష్టి పెట్టగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్ఎస్ఈ) మాత్రం మదుపరుల రక్షణకు చర్యలు తీసుకోలేకపోయిందని విమర్శించారు. అదానీని కాపాడటానికే ఎన్ఎస్ఈపై మోదీ ఒత్తిడి తెస్తున్నారా అని ప్రశ్నించారు.




# తేలని పంచాయితీ

# కన్నట నాట 'సీటు' పోటు

## సీఎం ఎవరన్నది డిసైడ్ చేయలేదు.. 48-72 గంటలు పట్టొచ్చు

కర్ణాటక రాజకీయం కొలిక్కి వచ్చిందని.. ముఖ్యమంత్రి పదవిలో సిద్దరామయ్య.. డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ను ఖరారు చేసినట్లుగా జరుగుతున్న వాదనలో ఏ మాత్రం నిజం లేదని తేల్చేసింది కాంగ్రెస్. గడిచిన నాలుగు రోజులుగా కర్ణాటక రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై భారీ ఎత్తున కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి కర్ణాటకకు ముఖ్యమంత్రి విషయాన్ని కాంగ్రెస్ అధినాయకత్వం తేల్చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. జాతీయ మీడియా మొదలు కొని స్థానిక మీడియా వరకు సీఎం పదవికి సిద్దరామయ్యకు ఎంపిక చేశారన్న వార్తలు రావటం.. దీనికి తగ్గట్లే సిద్ధూ వర్గీయులు సంబరాలు చేసుకోవటం తెలిసిందే. సిద్దరామయ్య ఇంటి వద్ద భద్రత పెంచిన వైనంతో ఆయనే తదుపరి సీఎం అన్న ప్రచారం సాగింది. ఇలాంటి వేళ సీన్లోకి వచ్చారు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కమ్ పార్టీ పరిశీలకుడు రణ్ దీప్ సూర్జేవాలా. ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా పార్టీ ఇప్పటివరకు ఎవరిని ఫైనల్ చేయలేదని.. బయట జరుగుతున్న ప్రచారం మొత్తం తప్పని తేల్చారు. తుది నిర్ణయం తీసుకోవటానికి మరింత సమయం పడుతుందన్నారు. ప్రస్తుతం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తో చర్చలు జరుగుతున్నాయని.. నేడో.. రేపో నిర్ణయం తీసుకునే వీలుందన్నారు. "మరో 48 గంటల నుంచి 72 గంటల్లో కర్ణాటకలో కొత్త కేబినెట్ ను ఏర్పాటు చేస్తామని.. కర్ణాటక ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం మీద కూడా తప్పుడు ప్రచారం జరుగుతుందని తేల్చేశారు. జరుగుతున్న ప్రచారమంతా ఫేక్ అని తేల్చేసిన ఆయన.. విషయాన్ని మళ్లీ మొదటికి తీసుకొచ్చారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారం ప్రకారం.. ముఖ్యమంత్రిగా సిద్దూను.. డీకే శివకుమార్ ను డిప్యూటీ సీఎంగా నిర్ణయించిన ట్లుగా ప్రచారం జరిగింది. ఒప్పందంలో భాగంగా మొదటి రెండేళ్లు సిద్దూకు.. మిగిలిన మూడేళ్లు డీకే శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవిని చేపడతారని చెప్పినా.. సూర్జేవాల్ ప్రకటనతో అవన్నీ తప్పుగా తేలిపోయాయి. మళ్లీ అధికారిక ప్రకటన ఎప్పుడు వెలువడుతుందో చూడాలి.

# కొత్త సచివాలయం లెక్కే వేరు.. డిజిటల్ పాస్ లతో దడ పుట్టిస్తున్నారట

హైదరాబాద్ : పారదర్శకత పేరుతో పట్టు సాధించే ప్రయత్నాన్ని చేస్తున్న ప్రజా ప్రభుత్వ విధానాలు కొన్నింటిని చూస్తే.. అసలు లెక్కలు ఇట్టే అర్థమవుతాయి. తాజాగా అలాంటి తీరుకే తెర తీశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన కలలకు ప్రతిరూపంగా కొత్త సచివాలయాన్ని చెప్పాలి. వందల కోట్ల ప్రజాసొమ్ముతో నిర్మించిన ఈ రాజభవనం లాంటి పాలనా సముదాయంలో అనుసరిస్తున్న కొత్త విధానాలు ఇప్పుడు షాకింగ్ గా మారాయి. ప్రభుత్వ కార్యాలయం అన్న తర్వాత అందరూ వచ్చి వెళుతుంటారు. అందరికి అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు ఉండాలి. కానీ.. ఇప్పుడు భద్రత పేరుతో కొత్త తీరుకు తెర తీస్తున్నారు. కొత్త సచివాలయానికి చాలామంది వచ్చి వెళుతుంటారు. కానీ.. అలాంటిదేమీ లేకుండా సచివాలయంలోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరి లెక్క పక్కాగా తేల్చే కార్యక్రమానికి తెర తీశారు. పటిష్ట భద్రత పేరుతో ఆంక్షల కన్ను మొత్తంగా అలుముకుంటుంది. గతంలో మాన్యువల్ పాస్ లు ఇచ్చేవారు. ఇక.. జర్నలిస్టులతోపాటు.. కొందరి విషయంలో ఎలాంటి ప్రత్యేక పాసులు లేకుండా వెళ్లి.. కలిసి వచ్చే వీలుండేది.

కానీ..ఇప్పుడు అందుకు భిన్నంగా ప్రత్యేక పద్ధతిని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సచివాలయంలోకి ఎవరూ అడుగు పెట్టాలన్నా.. వారికి సంబంధించిన వివరాలు పక్కాగా నమోదు కావాలి. అంతేనా.. లోపలకు వెళ్లిన తర్వాత ఎవరినైతే కలవాలో వారిని మాత్రమే కలవాలి. అంతకు మించి కలిసేందుకు అనుమతి ఉండదు. ఒకవేళ కలవాలంటే మళ్లీ పాసు తీసుకోవాలి. అంటే.. ఒకరిని కలవటానికి వెళ్లి పనిలో పనిగా నలుగురైదుగురిని కలిసే వీలు.. వెసులుబాటు ఉండదన్న మాట. అంటే.. ఇరిగేషన్ శాఖకు వెళ్లిన వ్యక్తికి.. కేవలం ఇరిగేషన్ శాఖకు చెందిన వారినే కలిసే వీలు ఉంటుంది. ఉదాహరణకు ఇరిగేషన్ శాఖలో సుబ్బయ్యను కలవటానికి వెళితే.. సుబ్బయ్యను మాత్రమేకలవాలి. ఎల్లయ్యను.. పుల్లయ్యను కలిసేందుకుఅనుమతించారు. వేరే శాఖలో మిత్రుడుఎవరైనా ఉండి.. నా దగ్గరకు వచ్చి పో అనే మాటకు ఛాన్సు లేదు. అంతేనా.. సచివాలయంలోకి అడుగుపెట్టినప్పటి నుంచి తిరిగి వచ్చే వరకు ఎవరిని కలిశారు? ఎంతసేపు



కలిశారు? లాంటి సమాచారం మొత్తం రికార్డు అయ్యే వ్యవస్థను తీసుకొచ్చారు. పాస్ ల ప్రక్రియను చూసేందుకు వీలుగా ఒక ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పారు. అంతేనా.. సచివాలయం చుట్టూ 300 వరకుసీసీ కెమేరాల్ని ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానించటంతో ప్రతి అంగుళం నిఘా నీడలోకి వచ్చేస్తుంది. దీంతో.. సచివాలయంలోసామాన్యులకుప్రవేశం అస్సల్లేదు.

మిగిలిన లెక్కల్ని పక్కన పెడదాం. ఎవరైనా ఒక వ్యక్తి సచివాలయంలోని తనకు తెలిసిన పాతిక మందికి పెళ్లి కార్డులు ఇవ్వాల్సి వస్తే.. పరిస్థితి ఏమిటంటారు?

## సీఎస్ అధ్యక్షతన రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల కమిటీ ఏర్పాటు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షతన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వ సలహాదారు కేవీ రమణ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు కొనసాగనున్నారు. దశాబ్ది ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ వ్యవహరించనున్నారు. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తొమ్మిదేండ్ల అనతికాలం



లోనే దేశానికే ఆదర్శంగా పాలన కొనసాగిస్తూ, పదవ వసంతంలోకి అడుగిడుతున్న చారిత్రక సందర్భంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా, ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్సవాలు తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా, తెలంగాణ ఘనకీర్తి దశ దిశలా చాటేలా, ప్రతి హృదయం ఉప్పొంగేలా పండుగ వాతావరణంలో నిర్వహించాలని సీఎం సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ వరకు, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి 21 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు.



# ట్రయాంగిల్ ఫైట్ జరగాలి

# గులాబీ జెండా ఎగరాలి

హైదరాబాద్ : తెలంగాణా సీఎం కేసీయార్ ఒక విధంగా బేఫికర్ గానే ఉన్నారు అని భావించాలి. కాగల కార్యం గంధర్వులు తీరుస్తారు అన్న సామెత మాదిరిగా తెలంగాణాలో అటు చూస్తే కాంగ్రెస్ ఇటు చూస్తే బీజేపీ రెచ్చిపోయి మరి తెగ పోటీ పడుతున్నాయి. ఈ భీకర పోరులో ముచ్చటగా మూడవసారి టీయారెస్ గెలిచి తీరడం ఖాయమని ఆయన లెక్కలేస్తున్నారు. నిజంగా జరిగేది కూడా అదే అని రాజకీయ గణితం కూడా తేల్చిచెబుతోంది. ఇప్పటికి రెండు సార్లు కేసీయార్ ని జనాలు ఆదరించారు. మొదటి సారి తెలంగాణా వాదంతో ఆయన విజయం సాధించారు. రెండవసారి వ్యతిరేకత ముదరకముందే ముందస్తు ఎన్నికలకు సిద్ధపడ్డారు. తీరా ఎన్నికలలో విపక్ష కాంగ్రెస్ మంచి జోరు చూపిస్తుంది అన్న అంచనాలు ఉన్న నేపధ్యంలో సడెన్ గా తెలుగుదేశంతో పొత్తు పెట్టుంది. అంతే అప్పటిదాకా అణగి ఉన్న తెలంగాణావాదాన్ని కేసీయార్ బయటకు లాగి మరీ రెచ్చగొట్టారు. ఆ దెబ్బతో మ్యాజిక్ ఫిగర్ ని దాటి ఏ డెబ్బయి సీట్లో దక్కించుకోవాల్సిన కాంగ్రెస్ ఒక్కసారిగా చతికిలపడిపోయింది. అలా 2018 ఎన్నికల్లో అద్వితీయంగా ద్వితీయ విజయాన్ని తన ఖాతాలో కేసీయార్ నమోదు చేసుకున్నారు. ఇక 2023లో మరోసారి గెలవాలి. హ్యాట్రిక్ కొట్టాలి. తెలంగాణాలో సీన్ చూస్తే అలా ఏమీ లేదు. దాంతో ఏం చేయాలో తెలియక గులాబీ శిబిరం సతమతమవుతోంది.

ఈ నేపథ్యంలో కమలం పార్టీ దూకుడు ఒక్కసారిగా పెంచింది. నిజానికి 2014 2019 ఎన్నికలలో కాంగ్రెస్ టీయారెస్ ల మధ్య ద్విముఖ పోరు సాగింది. ఈసారి మాత్రం బీజేపీ జోరు చేయడంతో కచ్చితంగా త్రిముఖ పోరు జరగనుంది. ఇక చూస్తే కాంగ్రెస్ బీజేపీ రెండూ జాతీయ పార్టీలే. ఈ రెండు పార్టీలకు దూరంగా ఉండాలని కేసీయార్ ఆలోచిస్తూ చివరికి రాష్ట్రపతి ఎన్నికల్లో యశ్వంత్ సిన్హాకు మద్దతు ప్రకటించారు. ఆయన ప్రతిపక్షాలు బలపరచిన అభ్యర్థి దానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తోంది తప్ప కాంగ్రెస్ నేరుగా పెట్టిన క్యాండిడేట్ కాదు. ఈ విధంగా కేసీయార్ కాంగ్రెస్ తో తాము జట్టు కట్టాము అన్న మచ్చను లేకుడా చూసుకోగలిగారు. అదే టైమ్ లో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వకుండా తన వైఖరిని చాటి చెప్పగలిగారు. ఈ రెండు పార్టీలూ తమకు శత్రువులే అని తెలంగాణాలో ఎస్టాబ్లిష్ చేయడం ద్వారా ముగ్గురూ ముగ్గులోకి దిగుతారు అన్న మాట. ఈసారి కేసీయార్ మీద ఉన్న వ్యతిరేకత కాస్తా బీజేపీ కాంగ్రెస్ పంచుకుంటాయి. ఈ రెండు పార్టీలు చచ్చినా అవగాహనకు వచ్చే అవకాశం లేదు. అవి జాతీయ పార్టీలు కావడంతో పాటు వాటి మధ్య ఉన్న పోరు దశాబ్దాల నాటిది. అందువల్ల ఢీ అంటే ఢీ కొట్టి అరవై శాతం ఉన్న టీయారెస్ వ్యతిరేకతను చెరో ముప్పై శాతం లాగేసుకున్నా పది శాతం మార్జిన్ తో అయినా టీయారెస్ బయటపడి తీరుతుంది. అదే కేసీయార్ కూడా కోరుకుంటోంది. అందుకే ఆయన మోడీ రానీయ్ అమిత్ షా రానీయ్ రాహుల్ రానీయ్ అని అంటున్నారు. ఎంత మంది వచ్చి తెలంగాణాలో ఎంతలా తిరిగినా విపక్ష ఓట్లే భారీగా చీలిపోతాయి. తాను సేఫ్ జోన్ లో ఉంటాను ఇదీ గులాబీ బాస్ పక్కా వ్యూహం. దాన్ని నిలబెట్టుకునేలా చివరి నిముషం వరకూ బెట్టు చేసి మరీ యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇచ్చారు. మొత్తానికి హ్యాట్రిక్ విక్టరీ కొడితే మాత్రం కేసీయార్ ని ఆపడం ఎవరి తరం కాదు 2024లో జరిగే లోక్ సభ ఎన్నికలకు ఆయన ఫ్రీ అయిపోయి మోడీతో ఢిల్లీ మే సవాల్ అంటూ జబ్బలు చరచడం ఖాయం.

## సంపాదకీయం

# డొల్ల కంపెనీలతో చైనా వాళ్ళు మనీల్యాండరింగ్ ?

మనదేశంలో డొల్ల కంపెనీలు పెట్టి చైనా వాళ్ళు మనీల్యాండరింగ్ చేస్తున్నారా ? రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ (ఆర్వోసీ) వర్గాల ప్రకారం అవుననే సమాధానం వస్తోంది. కొన్ని లావాదేవీలపై అనుమానం వచ్చిన ఆర్వోసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు రంగంలోకి దిగి తీగ లాగితే డొంకంతా కదులుతోంది. ఇప్పటివరకు మనీల్యాండరింగ్ చేస్తున్న 500 చైనా కంపెనీలను గుర్తించారు. ఈ డొల్ల కంపెనీల్లో చైనా వాళ్ళతో పాటు స్థానికంగా మన వాళ్ళను కూడా కొందరిని డైరెక్టర్లు పెట్టుకుంటున్నారు. ఇలాంటి డొల్ల కంపెనీలు ఏపీలో 4 తెలంగాణలో 12 కర్ణాటకలో 197 తమిళనాడు మహారాష్ట్రలో కూడా ఉన్నట్లు లెక్క తేలింది. ఏపీలో ఆర్వోసీ అధికారులిచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. దీంతో చిత్తూరు జిల్లాలోని శ్రీ సిటీ అడ్రస్ మాత్రమే కరెక్టని తేలింది. మిగిలిన మూడు కంపెనీల అడ్రస్సులు బోగస్ అని తేలింది. శ్రీ సిటీ లో కూడా అడ్రస్ మాత్రమే కరెక్టని మిగిలిందంతా డొల్ల వ్యవహారమేనట. ఏవో పేర్లతో కంపెనీలు రిజిస్టర్ చేయటం చైనా నుంచి ముడిసరుకులు తెప్పించుకుంటున్నట్లు ఇన్వాయిస్ లు సృష్టించటం డబ్బులు చెల్లిస్తున్నట్లు బిల్లులు కూడా సృష్టిస్తున్నారు. అయితే సరుకు రాకుండానే డబ్బులు చెల్లిస్తున్నారు. దీంతో ఇన్వాయిసులు బిల్లులంతా బోగస్ అని అర్ధమైపోయింది. కేంద్ర కార్పొరేట్ మంత్రిత్వ శాఖ వర్గాల ప్రకారం చైనా మనదేశంలో 500 కంపెనీలు రిజిస్టర్ చేసి మనీ ల్యాండరింగ్ కు పాల్పడుతోందట. ఇండియా డైరెక్టర్లుగా నియమించుకున్న స్థానికులకు నెలకు రు. 10 వేలు చెల్లిస్తోంది. స్థానిక డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీళ్ళలో ఎవరికి కూడా కంపెనీల కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని అర్ధమవుతోంది. చైనా వాళ్ళు డొల్ల కంపెనీల ఏర్పాటుకు సహకరించిన కంపెనీ సెక్రటరీలు చార్టెడ్ అకౌంటెంట్లు ఆర్వోసీ అధికారులపైన కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. కంపెనీలు రిజిస్టర్ చేసుకుంటున్నట్లు దరఖాస్తుల్లో చెప్పిన అడ్రసులు చాలావరకు బోగస్ అని గుర్తించారు. దర్యాప్తు పూర్తిగా జరిగితే ఇంకెన్ని నిజాలు బయటపడతాయో చూడాలి.

# కలుషిత నీటితోనే.. అధిక సమస్యలు!



సిద్దిపేట : సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. కలుషిత భోజనం, నీరు ఇందుకు కారణం. ఆహార సామగ్రిని భద్రపరిచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోవడం, రక్షిత మంచినీటిని వాడకపోవడం, నాణ్యత లేని గుడ్లను ఉడికించి ఇవ్వడం ఇలా పలు అంశాలు విద్యార్థులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. సిద్దిపేటలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో కలుషితాహారం తిని 128 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. చిన్నకోడూరు మండలం సూరారం ఉన్నత పాఠశాలలో నీటి కలుషితం వల్ల 15 మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో బీసీబాలుర వసతిగృహంలో ఉదయం అల్పాహారం తిని నలుగురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. ఈ క్రమంలో వసతిగృహాలు, పాఠశాలల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిద్దిపేట జిల్లా ఆహార పరిరక్షణ అధికారి సీహెచ్. క్రిష్ణమూర్తి 'ఈనాడు'తో మాట్లాడుతూ వివరించారు. త్వరలోనే ప్రతి పాఠశాలకు, గురుకులాలకు ఇదే అంశాల గురించి అవగాహన పెంచేలా చర్యలు తీసుకోనున్నామని ఆయన వెల్లడించారు. ట్యాంకులో నీళ్లను భోజనం వండేందుకు వినియోగిస్తుంటారు. ఇవి కలుషితం కావడం వల్ల ప్రధానంగా సమస్యలు వస్తుంటాయి. 90 శాతం ఇబ్బందులకు సురక్షితం కాని నీరే కారణం. అందుకే ట్యాంకులపై మూతలు తప్పనిసరిగా ఉండేలా చూడాలి. క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయాలి. స్థానికంగా అందుబాటులో ఉండే పరీక్షా కేంద్రాలకు నమూనాలు తీసుకెళ్లి నీటి నాణ్యతా పరీక్షలూ చేయిస్తే మేలు. ఆహారాన్ని సిద్ధం చేసే సమయంలో చాలా రకాల వ్యర్థాలను అక్కడే పడేస్తుంటారు. దీనివల్ల కలుషితమయ్యే అవకాశాలుంటాయి. వంటగదుల సమీపంలోకి కుక్కలు, పందులూ వస్తుంటాయి. అందుకే ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలి. కొన్నిసార్లు పాడైపోయిన సరకుల వల్ల ఆహారం కలుషితమవుతుంది. అందుకే భోజనం వండేటప్పుడు ఆయా సరకులు కాలం చెల్లినవా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలి. వంటపాత్రలను శుభ్రం చేసే సమయంలో అందుకోసం ఉపయోగించిన సర్ఫ్ లేదా సబ్బు అవశేషాలు ఏమాత్రం మిగిలినా ఇబ్బందులు వస్తాయి. అందుకే వంటపాత్రలను శుభ్రం చేసేటప్పుడు పూర్తిగా అవశేషాలు తొలగేలా చూడాలి. పాతచింతపండు వాడి పులుసు చేసినా సమస్యలు వస్తాయి. అందుకే చాలా కాలం నిల్వ ఉంచిన చింతపండును వాడొద్దు పచ్చిపులుసు చేసే సమయంలో తప్పనిసరిగా కాచిచల్లార్చిన నీటిని ఉపయోగించడం ఉత్తమం. వసతిగృహాలు, పాఠశాలల్లో ఉండే ఆర్వో ప్లాంట్ల నిర్వహణా మెరుగ్గా ఉండాలి. లేని పక్షంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుంది. వంట చేసే ముందు వంటమనుషులు చేతులను శుభ్రంగా కడుక్కునేలా చూడాలి. ఆహారం తినేముందు పిల్లలూ ఇదే పద్ధతిని తప్పనిసరిగా పాటించేలా తగిన ఏర్పాట్లు చేయాలి. మాంసాహారాన్ని బాగా ఉడికించిన తర్వాతే వడ్డించాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ మిగిలిపోయిన కూరలను వడ్డించకూడదు. నాణ్యత లేని, కుళ్లిన కోడిగుడ్లను వండిపెట్టొద్దు ఉడకబెట్టేముందు నీటిలో వేస్తే తేలిన గుడ్లను పక్కనపెట్టేయాలి. కేవలం మునిగిన వాటినే ఉడికించాలి. కుళ్లిపోయినవే తేలుతాయి. ప్రతిసారీ ఇలా చేయాలి. బియ్యం, ఇతర ఆహార పదార్థాలు నిల్వచేసే చోటు శుభ్రంగా ఉండాలి. ఎలుకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుకలు ఆహారపదార్థాల్లో మలమూత్రాలను విసర్జించకుండా చూడాలి. వంటమనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. గోర్లు తీసుకోవాలి. ఒకవేళ వారి చేతులకు గాయాలయితే.. మానేవరకు వంటపనికి దూరంగా ఉండాలి. వారికి అంటువ్యాధులు ఏమైనా ఉన్నాయనే విషయాన్ని తెలుసుకునేందుకు ఆరునెలలకోసారైనా స్థానిక వైద్యులతో పరీక్షలు చేయించాలి.

# 90వేల మందికి.. కోడిగుడ్డు అందట్లే!



సంగారెడ్డి : చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ బడుల్లో కోడిగుడ్డును అందిస్తున్నారు. వారానికి మూడు రోజులు భోజనంలో ఇవ్వాలనే నిబంధన ఉంది. స్థానికంగానే వంట చేసి వడ్డించే చోట సమస్య లేదు. అక్షయపాత్ర ద్వారా అన్నం, కూరలు సరఫరా చేసే పాఠశాలల్లో పిల్లలకు గుడ్డు అందడం లేదు. కరోనాతో రెండేళ్లు విద్యాలయాలు నడవలేదు. అంతకుముందు మూడేళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా ప్రత్యామ్నాయం చూపడంలో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారం చూపితే ప్రభుత్వ బడుల్లో చదివే నిరుపేద విద్యార్థులకు గుడ్డురూపంలో పౌష్టికాహారం అందే వీలుంది. ప్రత్యామ్నాయం చూపితే మేలు: జిల్లాలో 1,265 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 1.27లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో అక్షయపాత్ర ద్వారా 16 మండలాల్లోని 632 బడులకు మధ్యాహ్న భోజనం అందుతోంది. వీటిలో 90వేల పైచిలుకు విద్యార్థులున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరికి భోజనంతో పాటు గుడ్డు ఇవ్వడం లేదు. అక్షయపాత్ర వారు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిగుడ్డు ఉడికించి ఇవ్వమని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో స్థానికంగానైనా ప్రత్యామ్నాయం ఆలోచించాలి. జిల్లాలోని సగం అంగన్వాడీలకు అక్షయపాత్ర ద్వారానే భోజనం ఇస్తున్నారు. అంగన్వాడీలకు ఇతర మార్గాల్లో గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఆయాలు వీటిని ఉడికించి పిల్లలకు తినిపిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల లోపు చిన్నారులకు నేరుగా ఒకేసారి గుడ్లను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కోడిగుడ్లను ఉడికించేందుకు అవసరమైన మౌలిక వసతులు లేకపోవడంతో ఇక్కడ సమస్య ఎదురవుతోంది.

అరటిపండు, పల్లిపట్టీ ఇస్తామంటున్నారు

గుడ్డుకు ప్రత్యామ్నాయంగా అరటిపండు లేదా పల్లిపట్టీలు ఇచ్చేందుకు అక్షయపాత్ర అంగీకారం తెలిపింది. గుడ్డుకు ఇవేవీ ప్రత్యామ్నాయం కాబోవని గతంలోనే జాతీయ పోషకాహార సంస్థ తేల్చి చెప్పింది. కచ్చితంగా మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కోడిగుడ్డునే అందించాలని స్పష్టం చేసింది. ఈ కారణంగా గుడ్డు అందక.. ఇతర ప్రత్యామ్నాయ తినుబండారాలూ లేక విద్యార్థులు నష్టపోతున్నారు. స్థానిక మహిళలే మధ్యాహ్న భోజనం వండే చోట్ల బిల్లుల జాప్యం, తక్కువ డబ్బులు చెల్లిస్తుండటంతో చాలా మంది వంట చేయడానికి ఆసక్తి చూపడం లేదని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. క్రమంగా ఇక్కడా అనేక రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాల్సిన అవసరముంది.

ప్రతినెలా రూ. 54లక్షలు వాడుకోలేని పరిస్థితి

ఒక్కో విద్యార్థికి వారానికి 3 కోడిగుడ్లు ఉడికించి ఇవ్వాలి. ఈ లెక్కన నెలకు ఒక్కో విద్యార్థికి 12 గుడ్లు అందుతాయి. ఈ గుడ్డును సరఫరా చేసేవారికి ఒక్కోదానికి రూ. 5 ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ లెక్కన ఒక విద్యార్థిపై నెలకు రూ. 60 ఖర్చుపెడుతుంది. జిల్లాలో 90వేల పైచిలుకు విద్యార్థులకు కలిపితే ఈ మొత్తం రూ. 54 లక్షలకు చేరుతుంది. అక్షయపాత్ర ద్వారా గుడ్డు ఇవ్వకపోవడం, ప్రత్యామ్నాయంగా వేరే మార్గాల ద్వారా దీనిని అందించకపోవడంతో ఈ డబ్బును జిల్లాలో సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

నిర్వాహకులతో చర్చలు జరుపుతున్నాం.. : – నాంపల్లి రాజేష్, జిల్లా విద్యాధికారిఅక్షయపాత్ర ద్వారా భోజనం ఇచ్చే బడుల్లో ఏళ్లుగా కోడిగుడ్లు అందడం లేదు. వారు సరఫరా చేయమని స్పష్టంగా చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే అంశమై పరిశీలిస్తున్నాం. గుడ్డు ఇవ్వని పక్షంలో కనీసం అరటిపండు లేదా ఇతర తినుబండారాలు అందించేందుకు అక్షయపాత్ర ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారు. గుడ్డుకు ఇవేవీ ప్రత్యామ్నాయం కావు. అందుకే ఏం చేయాలనే కోణంలో సమాలోచనలు చేస్తున్నాం.

# పైసలెప్పుడిస్తరు సారూ!

ఖమ్మం : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో యాసంగి ధాన్యం విక్రయించిన రైతుల్లో కొందరికి ఇంకా ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఉభయ జిల్లాల్లో సుమారు రూ. 12 కోట్ల మేర బకాయిలు అన్నదాతలకు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగుకు సన్నద్ధమవుతున్న కర్షకులు ఈ సొమ్ము కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. సకాలంలో ధాన్యం డబ్బు చెల్లించకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఎన్నాళ్లీ నిరీక్షణ

యాసంగిలో ధాన్యం సేకరణ ఏప్రిల్ రెండోవారం నుంచి ముమ్మరంగా మొదలైంది. జూన్ రెండోవారం కల్లా ఉభయ జిల్లాల్లో సేకరణ పూర్తయింది. కానీ రైతుల ఖాతాల్లో డబ్బు జమకావడంలో జాప్యం జరుగుతోంది. వ్యయప్రయాసలకోర్చి ధాన్యం విక్రయించినా నగదు కోసం నిరీక్షణ తప్పడంలేదు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే



సొమ్ము ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా.. నెల దాటినా రాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే ధాన్యం డబ్బు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం విక్రయించి 20 రోజులు దాటుతున్నా ఇంకా ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. అధికారులను అడిగితే రేపు మాపని చెబుతున్నారు. ప్రస్తుతం పంటల సాగుకు సమయం ఆసన్నమైంది. చేతిలో పెట్టుబడులు లేక ఇంకా సాకు మొదలుపెట్టలేదు. మా గ్రామంలో ఇంకా 20మందికి డబ్బు అందాలి. ఆకుల రమేశ్, రెబ్బవరం, వైరా మండలం

జిల్లాలో ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది. చాలామందికి ధాన్యం డబ్బు అందింది. కొద్దిమందికి మాత్రమే అందాలి. రెండు మూడ్రోజుల్లో ఖాతాల్లో నగదు చేరేలా చూస్తాం. మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

జిల్లాలో రైతులు 10,950 సేకరించిన ధాన్యం (మె.ట.) 75,013? రెండు జిల్లాల్లో కలిపి మొతం సుమారు రూ. 180 కోట్ల మేర అన్నదాతలకు చెల్లించాలి. ?ఇందులో ఖమ్మం జిల్లాలో సుమారు రూ. 10 కోట్లు, భద్రాద్రి జిల్లాలో రూ. 2 కోట్ల వరకు బకాయిలున్నాయి. సుమారు 3వేల మంది రైతులు నిరీక్షిస్తున్నారు.

# హరితహారానికి రంగం సిద్ధం

కొత్తగూడెం : ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక రీతిలో హరితహారం నిర్వహిస్తోంది. పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా కృషి చేస్తోంది. వృక్ష సంపదే లక్ష్యంగా ఏడు విడతలను పూర్తి చేసి ఈ ఏడాది ఎనిమిదో విడతకు రంగం సిద్ధం చేశారు. ఈ నెలలో ప్రారంభం కానున్న హరితహారం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఎనిమిదో విడత హరితహారం కింద ఈ ఏడాది జిల్లాలో 95.62 లక్షల మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని 481 నర్సరీల్లో, అటవీ శాఖ ఆధ్వర్యంలోని 25 నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టారు. ప్రతి పంచాయతీ పరిధిలో 10 వేల మొక్కల్ని నాటాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాల్లో పొలంగట్లు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, చెరువు కట్టలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇళ్ల ఆవరణలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇంటింటికి కనీసం 6 మొక్కలు సరఫరా చేసి సంరక్షించేలా చైతన్యం చేయనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఖాళీ అటవీ భూముల్లో, ప్రధాన రహదారులకు ఇరువైపులా 20 లక్షల మొక్కలు నాటనున్నారు. ఆగస్టు నెలాఖరు వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం



చేస్తున్నారు.

తీరిన కొరత

గతంలో నర్సరీలు తక్కువ సంఖ్యలో ఉండేవి. మొక్కల కొరత తీవ్రంగా ఉండేది. మూడేళ్లుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో ఓ నర్సరీని ఏర్పాటు చేశారు. 481 పంచాయతీల్లో ప్రతిచోటా నర్సరీని ఏర్పాటుచేశారు. ఒక్కోచోట 10వేల నుంచి 15వేల వరకు మొక్కల్ని పెంచుతున్నారు.

సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

హరితహారంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. మొక్కల పంపిణీతోపాటు నాటడం, రవాణా వంటి వ్యవహారాలను చూసుకునేందుకు జిల్లాలో ప్రత్యేకంగా ఓ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. కలెక్టర్ దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వివిధ విభాగాల జిల్లా అధికారులు సభ్యులుగా ఉన్నారు.

ఏవి మొక్కలు?

1. రహదారుల పక్కన నాటేందుకు టేకు, కానుగ, వేప తదితర నీడనిచ్చే మొక్కలతోపాటు పూలు, పండ్ల మొక్కలు.

# నూనె గానుగలపై పర్యవేక్షణేదీ ?

గద్వాల : వేరుశనగలను గానుగల ద్వారా మర ఆడించి వంటకు అవసరమైన స్వచ్ఛమైన నూనెలను తీస్తారు. ఇలా తీసిన నూనె నాణ్యత, రుచికరంగా ఉంటుందని ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజుకు వందల లీటర్లను విక్రయించే గానుగ నూనె కేంద్రాలపై ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైందని స్థానికులు వాపోతున్నారు. మదనాపురం మండల కేంద్రంలో మూడు గానుగ కేంద్రాలను కొందరు వ్యాపారులు ఏర్పాటు చేశారు. వీటి వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా నూనెలను తయారు చేస్తూ ప్రజలకు విక్రయిస్తున్నారు. వేరుశనగలతో తయారు చేసిన నూనెకు ఇతర నూనెలను కలిపి కల్తీ చేసి ప్రజలకు విక్రయిస్తున్నారని కొనుగోలుదారుల నుంచి కొన్ని



రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. వాటిని వినియోగించడంతో అనారోగ్య సమస్యలు అవకాశం ఉందని ఆందోళన చెందుతు న్నారు.

మూడు కేజీల పల్లీలకు.. ఒక లీటర్

సాధారణంగా మూడు కేజీల వేరుశనగ పల్లీలను గానుగ ఆడిస్తే కేవలం ఒక కేజీ నూనె మాత్రమే వస్తుంది. కేజీ స్వచ్ఛమైన నూనెను కొనుగోలు చేయాలంటే రూ.350పైగా చెల్లించాలి. ఇక్కడి గానుగల కేంద్రాల వద్ద కేవలం రూ.180–230 వరకే లభిస్తుంది. మార్కెట్‌లో కేజీ పల్లీలు రూ.110 చొప్పున అంటే మూడు కేజీలకు రూ.330తో పాటు యంత్రం పరికరాల ఖర్చు, కూలీలు, ఇతర ఖర్చులు కలుపుకుంటే రూ.400పైగా అవుతోంది. అలాంటిది ఇక్కడి కేంద్రాల్లో లీటర్ నూనె రూ.180 నుంచి 230 ధరలకు విక్రయిండం ఎలా సాధ్యమవుతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోజుకు ఈ కేంద్రాల నుంచి సుమారుగా కొన్ని వందల లీటర్ల నూనెను హోటళ్లు, దాబాలతో పాటు ప్రజలకు విక్రయిస్తుంటారు. స్వచ్ఛమైన పల్లీల నూనె లేత పసుపు లేదా పసుపు రంగులో కనిపిస్తుంది. ఇక్కడ విక్రయించే నూనె నల్ల రంగులోకి మారి ఉంటుంది. ఇప్పటికైనా ఆహార కల్తీ శాఖ అధికారులు నూనె గానుగలపై నిరంతరం పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# మునగ రైతు నిండా మునిగె..!

గద్వాల : అకాల వర్షాలు మునగ సాగు రైతులకు కష్టాల్లోకి నెట్టింది. ఎన్నో ఆశలతో కొత్తగా వచ్చిన రకాలను ఎంపిక చేసుకుని సాగు చేసిన వారికి కన్నీళ్లు మిగిల్చాయి. కనీసం పెట్టుబడి కూడా రావడం లేదని బాధపడుతున్నారు. జిల్లాలో 250 ఎకరాలకు పైగా మునగ సాగైంది. కేటీదొడ్డి, మల్దకల్ మండలాల్లో రైతులు అత్యధికంగా సాగు చేశారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో త్వరగా పంట చేతికి వచ్చి కనీసం 15 ఏళ్లపాటు ఏడాదికి రెండు పంటలు వచ్చే వంగడాలను రైతులు సాగు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆకు, పూత, పిందె రాలి మునగ చెట్లు బోసిగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేశవాళి రకం దిగుబడి సరిగా రాక పోవడంతో కొందరు తమిళనాడు లోని దుండిగల్ నుంచి అలగిరిస్వామి మునగ రకాన్ని తెచ్చి సాగు చేశారు. దేశవాళి రకం మొక్కలు ఎకరాకు 2050కి పైగా నాటగా.. కొత్తరకం మొక్కలు ఎకరాకు కేవలం 120 మాత్రమే నాటామని రైతులు వివరించారు. దేశవాళి రకం ఎకరాకు 4–5 టన్నుల వరకు మాత్రమే దిగుబడి వస్తుందని అలగిరిస్వామి రకం ఎకరాకు కనీసం 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు.

తోటలో మొక్కలు ఏపుగా పెరగడానికి, త్వరగా పూత, పిందె



రావడానికి, చీడ పీడల నుంచి రక్షణకు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, సేద్యం ఖర్చులకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని తెలిపారు. వర్షాలకు మొత్తం నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యకం చేస్తున్నారు.

రూ.2.50 లక్షలు నష్టం వచ్చింది

తమిళనాడు నుంచి తెచ్చిన అలగిరిస్వామి కొత్తరకం మొక్కలు తెచ్చి 5 ఎకరాల్లో నాటా. గతేడాది పంట చేతికి వచ్చింది. ఈఏడు ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. అకాల వర్షాలతో చెట్లకు పూత, పిందె రాలింది. రూ.2.50 లక్షలు నష్టం వచ్చింది. పెట్టుబడి సైతం చేతికి రాలేదు. బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి.

బి.రాజారెడ్డి, బిజ్వారం

మూడెకరాల్లో సాగు చేశా..

రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టా. మార్చి నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు చెట్లకు తెగుళ్లు సోకి పూత, పిందె, కాయలు పట్టకుండా మారాయి. ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు మందులు వాడినా వర్షాలకు పని చేయలేదు. పంట దిగుబడి రాక రూ.1.25 లక్షలు నష్టపోయా.

శంకరమ్మ, మల్దకల్

# ఆక్రమణకు పన్నాగం.. తవ్వకాలు ఇష్టారాజ్యం!



సంగారెడ్డి: నీటి వనరులను పరిరక్షించాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు నిబంధనలను ఉల్లంఘిస్తూ చెరువులు కుంచించుకుపోయేలా పనులు చేస్తున్నారు. శిఖం, గరిష్ఠ నీటినిల్వ స్థాయి(ఎఫ్‌టీఎల్)తో పాటు బఫర్‌జోన్‌లోనూ ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదు. ప్రవాహానికి ఆటంకం కలిగేలా మట్టి పోయొద్దు. వీటన్నింటిని తుంగలో తొక్కుతూ కొందరు తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. సదాశివపేట మండలం ఎన్కెపల్లిలోని కొత్త చెరువే ఇందుకు నిదర్శనం.

నీరు చేరకుండా అడ్డుకట్ట రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల అనుమతి లేకుండా చెరువుల్లో ఎలాంటి పనులు చేయకూడదు. పట్టాభూములు ఉన్నా ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోయకూడదు. ఇక్కడ ఇవేవీ పాటించడం లేదు. కొత్తచెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా ఇదే విషయం బహిర్గతమైంది. వేసవిలోనూ చెరువులో నీళ్లు సమృద్ధిగానే ఉన్నాయి. చెరువులో నీళ్లున్న ప్రాంతం పక్కనే యంత్రాలతో లోతుగా కందకం తవ్వుతున్నారు. ఆ మట్టిని చుట్టూ కట్టలా పోస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో పట్టపగలే దర్జాగా చెరువు చుట్టూ ఇలాగే కట్ట నిర్మించడంలో కొందరు నిమగ్నమయ్యారు. ఈ కట్ట పోస్తున్న చోటు నుంచి వెనక్కి దాదాపు 500 మీటర్ల మేర చెరువులో నీళ్లుంటాయని అక్కడే ఉన్న కొందరు పశువుల కాపరులు వివరించారు.


మరోవైపు మట్టి నింపుతూ..

వర్షం కురిసినప్పుడు చెరువులోకి వరద చేరేలా ఉన్న కట్టు కాలువకు ఒకవైపు కందకం తవ్వి కట్ట పోస్తున్నారు. మరోవైపు ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీగా మట్టితో నింపుతున్నారు. ఏకకాలంలో ఈ రెండు పనులూ చకచకా చేసేస్తున్నారు. ఇది పూర్తయితే చెరువు పరిధి కుచించుకుపోతుంది. ఈ ప్రాంతం జాతీయ రహదారి 65కి పక్కనే ఉండటంతో ఇక్కడి భూములకు గిరాకీ బాగా ఉంది. దీనిని సొమ్ము చేసుకునే ప్రయత్నాలకు తెరలేపారు. కట్టుకాలువ వెడల్పును కొంత మేరకు తగ్గించేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కనీసం చెరువు ఎంత విస్తీర్ణంలో ఉందనే ప్రాథమిక సమాచారం కూడా వారు సరిగా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

రెవెన్యూ, నీటి పారుదలశాఖల సమన్వయ లోపం

కొత్త చెరువు వద్ద నిబంధనల ఉల్లంఘన సాగుతున్న తీరు గురించి నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ బాలగణేష్ దృష్టికి తీసుకెళ్లగా.. ఏఈతో పాటు స్థానిక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఇద్దరూ వెళ్లి పరిశీలించారన్నారు. ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోసినట్లు గుర్తించామన్నారు. దానిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ మేరకు మట్టి నింపినట్లు గుర్తించారని ఏఈ మహేష్‌ను అడగ్గా... సరైన వివరాలు చెప్పలేకపోయారు. తాము సర్వే చేసిన తర్వాత పూర్తి నివేదిక ఇస్తామన్నారు. సదాశివపేట తహసీల్దారు మనోహర్ చక్రవర్తిని అడిగితే నీటిపారుదల శాఖ అధికారులదే బాధ్యతన్నారు. బుధవారం ఉదయం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కూడా వెళ్లారని నీటిపారుదల శాఖ అధికారి చెప్పారనడంతో ఆయన ఫోన్ నంబరు ఇచ్చారు. ఆర్ఐతో మాట్లాడాలని సూచించారు. చివరకు ఆర్ఐ గణేష్‌ను అడగ్గా... తాను కొత్త చెరువు వద్దకే వెళ్లలేదన్నారు. ఇదే విషయాన్ని ఏఈ మహేష్‌ను అడిగితే.. తానొక్కడినే వెళ్లి వచ్చానన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు సాగుతున్నాయన్నారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రెండు శాఖలకు, అధికారులకు మధ్య సమన్వయలోపానికి వారి మాటలే నిదర్శనం.

# దొంగ బిల్లులు.. లేని జబ్బులు





ఆసిఫాబాద్ : అత్యవసర అనారోగ్య సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న పేదలకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ముఖ్యమంత్రి సహాయక నిధి పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పూర్తిగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కొనసాగే ఈ పథకంలో జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గం పెద్దబూద గ్రామం కేంద్రంగా అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వ్యాధులు లేకుండా, శస్త్రచికిత్సలు ఏవీ చేయకుండానే సీఎంఆర్ఎఫ్ నిధులు కొందరు నేతలు ఒక్కటై పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల పట్టణంలోని ఓ నేతకు సంబంధించిన ఆసుపత్రితోపాటు, మరో కార్పొరేట్ ఆసుపత్రి, కరీంనగర్ ఆసుపత్రి కేంద్రంగా ఈ దందా నడిచిందనే ప్రచారం సాగుతోంది. బెల్లంపల్లి మండలం పెద్దబూదలో మాజీ సర్పంచి ఈ తంతులో కీలకంగా వ్యవహరించి, రోగుల పేరుతో నకిలీ బిల్లులు సృష్టించి నగదు కాజేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇటీవలే సీఎంఆర్ఎఫ్ నిధులు తీసుకున్న 23 మంది పేర్లు, ఎంతెంత బిల్లులు తీసుకున్నారో ఈ పోస్టుల్లో స్పష్టంగా ఉంది. రూ.18 వేల నుంచి రూ.87 వేల వరకు చెక్కులు తీసుకున్న వారి వివరాలు, ఒక్కొక్కరు రెండు, మూడు సార్లు బిల్లులు తీసుకున్నట్లుగా పేర్లు ఉన్నాయి. ఈ ఒక్క గ్రామంలోనే ఈ మేరకు అవినీతి ఉంటే జిల్లా వ్యాప్తంగా మరెంతో ఉంటుందనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ రూ.50–60 లక్షల నిధులు పక్కదారి పట్టించినట్లుగా తెలుస్తోంది.

30 చెక్‌ల నిలిపివేత..

దొంగ బిల్లులు పెట్టి సీఎంఆర్ఎఫ్ నిధులు కొల్లగొట్టిన ఉదంతాలు బయటకు రావడం, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో పెద్దబూద పరిసర గ్రామాలకు సంబంధించిన 30 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయకుండా నిలిపివేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ పథకం అక్రమాలు గత నెల రోజుల నుంచి ఆ పార్టీ నేతల్లో అంతర్గతంగా తీవ్రమైన చర్చకు దారి తీసింది. వేమనపల్లికి చెందిన ఓ మండలస్థాయి నేత, బెల్లంపల్లి మాజీ ఎంపీపీలు ఈ వ్యవహారంలో చక్రం తిప్పారని, ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

ఇష్టానుసారంగా సహాయం..

ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి రూ.లక్ష వరకు ఖర్చు అయితే 40 శాతం, రూ.లక్ష దాటితే 80 శాతం ఆర్థిక సహాయం ఈ పథకంలో అందజేస్తారు. జిల్లాలో మాత్రం ఇష్టానుసారంగా బిల్లులు పెట్టి పెద్ద మొత్తంలో ఈ పథకం నిధులు జేబులో వేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సమగ్ర విచారణ చేయాలనే డిమాండ్ ప్రజలనుంచి వినిపిస్తోంది.

క్యాసినో ముఠా..

బెల్లంపల్లి, వేమనపల్లికి చెందిన కొందరు నేతలను క్యాసినో ముఠాగా స్థానికంగా పిలుస్తారు. బెట్టింగులకు పాల్పడడం, వివిధ పథకాల్లో అక్రమాలకు తెరతీయడం, అందులో వాటాలకు డిమాండ్ చేయడం, మాట వినని వారికి బెదిరింపులకు గురిచేయడం వీరి పనులు. హైదరాబాద్‌లోని ఓ నేతకు సన్నిహిత వ్యక్తి ద్వారా సీఎంఆర్ఎఫ్ నిధులను ఈ ముఠా సభ్యులే నొక్కేసినట్లుగా స్థానికంగా అందరూ చర్చించుకుంటున్నారు. ఓ మాజీ సర్పంచి తన బంధువులు, భార్య పేరు మీద ఏకంగా 7 సార్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు తీసుకోవడం ఈ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలకు పరాకాష్ఠగా నిలుస్తోంది. నకిలీ పత్రాలు ఇచ్చిన వారికి కొంత మేర నగదు ముట్టచెప్పి, మిగతాదంతా వీరు నొక్కేస్తున్నారని, 2018నుంచి ఇప్పటి వరకు ఈ పథకంలో లబ్ధిపొందిన వారి వివరాలను పరిశీలిస్తే అసలు దొంగలు బయటకు వస్తారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# బకాయిల భారం

నిర్మల్ : పిల్లల హాజరుశాతం పెంపునకు, పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్(బలవర్ధక) బియ్యం సరఫరా వంటి వాటిని నిర్వహిస్తూ సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. రోజుకో రకంగా కూరగాయలు, పప్పు, వారానికి మూడుసార్లు గుడ్డు అందజేస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. వారు శ్రద్ధగా వంట చేస్తూ విద్యార్థులకు అందజేస్తున్నారు. బడులకు వేసవి సెలవులు ఇచ్చినా ఇంతవరకు తమకు రావాల్సిన బిల్లులు అందక ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద మొత్తంలో..ఉమ్మడి జిల్లాలోని 3,503 ప్రభుత్వ విద్యాలయాల్లో పథకాన్ని అమలు చేస్తున్నారు. సుమారు 5వేలకుపైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గౌరవ వేతనంగా రూ.వెయ్యి ఇచ్చేవారు. దాదాపు రెండు నెలల క్రితం దానిని రూ.3వేలుగా అందించేందుకు సర్కారు నిర్ణయం తీసుకున్నా.. బడ్జెట్ కేటాయింపు మాత్రం ఇప్పటి వరకు చేయలేదు. వంటకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో సదరు నిర్వాహకులు అప్పులు తీసుకొచ్చి వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భరించి మరీ వంట చేశారు. నాలుగు జిల్లాలకు చెంది సుమారు రూ. 7.74 కోట్లు రావాల్సి ఉన్నాయి.అప్పులు చేసి..బకాయిలు పేరుకుపోవడంతో అప్పులు చేసిన సదరు కార్మికులు వాటిని తీర్చేదెలా అని ప్రశ్నిస్తున్నారు. ఒక పక్క బడుల బలోపేతం, మౌలిక వసతుల కల్పనకు మన ఊరు– మన బడి, మన బస్తీ– మన బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా.. వంట చేసిన బిల్లులు, ఇచ్చే గౌరవవేతనం మంజూరుకాక ఎదురు చూపులు చూసే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు వివరాలను ఆర్థిక శాఖకు పంపించినా ఇప్పటి వరకు వాటి జాడలేదు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకొని చెల్లింపులు చేసి ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు.

# అమ్మకానికి మాస్టర్ ప్లాన్ రహదారులు..!

మంచిర్యాల : మంచిర్యాలలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. గతంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిపాదిత రహదారులను నిర్మించకపోవడంతో ఆయా కాలనీల ఇరుకు రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మాస్టర్‌ప్లాన్ రహదార్లను కొంతమంది అమ్మకానికి పెడుతున్నారు. నిర్మాణాలు చేపట్టకుంటే ఆ స్థలాల్లో పక్కా భవనాలు నిర్మించే ప్రమాదముంది. మంచిర్యాల పట్టణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయోజనం లేని పనులు చేస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యగా మారిన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ముందుగా 1977లో మాస్టర్ ప్లాన్ రహదారులకు ప్రతిపాదనలు చేశారు. 25 ఏళ్లకోసారి పునఃపరిశీలన చేయాల్సి ఉండగా.. ఇక్కడ ఆలస్యంగా 2013లో చేశారు. అప్పుడు కొంతమంది రాజకీయ నాయకుల పట్టా భూములు రహదారిలో పోవద్దనే ఉద్దేశంతో పరపతిని ఉపయోగించి తమకనుకూలంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు. స్థానిక గోపాల్‌వాడ నుంచి ఆదర్శనగర్, వేములబస్తీ, తిలక్‌నగర్, సున్నంబట్టీవాడలోని లయన్స్ క్లబ్ భవనం వరకు నిర్మించే కొత్త, పాత మాస్టర్ ప్లాన్ల మధ్య చాలా వ్యత్యాసం వచ్చింది. ఒక్కోచోట ఒక మీటర్ నుంచి 30 మీటర్ల వరకు తేడా వచ్చింది. ఈ రెండు రహదారులకు ముందే సరిహద్దులు (ట్రెంచ్ కట్) ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రతిపాదిత రహదారి స్థలాల్లో కొన్ని ఇప్పటికే చేతులు మారాయి. కొంతమంది స్థిరాస్థి వ్యాపారులు పాత మాస్టర్ ప్లాన్ చూపించి కొత్త మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత రహదారి స్థలాలు అమ్ముకున్నారు. మరికొందరు కొత్త మాస్టర్ ప్లాన్ చూపించి



పాత మాస్టర్ ప్లాన్ రహదారి స్థలాలు విక్రయించారు. అక్కడ ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టకముందే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారులకు హద్దు కేటాయించి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్డు వరకు 80 అడుగుల ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. బెల్లంపల్లి చౌరస్తా దగ్గర ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందిన 1,815 గజాల స్థలానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రూ.6.34 కోట్లు చెల్లించడానికి రంగం సిద్ధం చేశారు. అయితే అక్కడి భూమికి ఎక్కువ ధర చెల్లించడంపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో దానిని పెండింగ్‌లో పెట్టారు.మంచిర్యాలలోని సున్నంబట్టీవాడలో గల ప్రధాన రహదారి నుంచి లయన్స్ క్లబ్ భవనం వరకు రెండేళ్ల కిందట 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారిపై దాదాపు రూ.2 కోట్లతో బీటీ నిర్మించారు. ఆ లయన్స్ క్లబ్ భవనం తర్వాత ప్రైవేట్ వ్యక్తుల పట్టా భూములు ఉండటంతో రహదారి నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తిలక్‌నగర్ వెళ్లే రహదారికి లింక్ లేకుండా పోయింది.

మంచిర్యాలలోని లక్ష్మీ సినిమా టాకీస్ చౌరస్తా నుంచి గోపాల్‌వాడ, హమాలివాడ మీదుగా 100 అడుగుల ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ఉంది. హైటెక్‌సిటీ కాలనీ పక్కన ఈ రహదారి స్థలం తమది అంటూ ఓ పరిశ్రమ యజమాన్యం కోర్టులో కేసు వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి శ్రీరాంపూర్ వచ్చినప్పుడు అక్కడ రైల్వే పైవంతెన నిర్మాణం కోసం రూ.57 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత కోర్టు కేసుతో నిధులు మంజూరుకాలేదు. పనులు చేపట్టలేదు.తిలక్‌నగర్‌లో మాస్టర్ ప్లాన్ రహదారి మధ్యలో చాలా తేడా వచ్చింది. పాత మాస్టర్ ప్లాన్ రహదారి ఊరు మధ్యలో గల ఆటో స్టాండ్ నుంచి నిర్మించాల్సి ఉంది. కొత్తగా మార్చిన మాస్టర్ ప్లాన్ తిలక్‌నగర్ ఊరు బయట నుంచి వచ్చింది. అక్కడ రహదారి నిర్మాణంలో వచ్చిన తేడాతో ఎక్కడ రహదారి నిర్మిస్తారో ఎవరి భూములు పోతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# ఎరువుల కొరత లేకుండా చర్యలు: కలెక్టర్

మెదక్ : వానాకాలంలో పంటల సాగుకు సరిపడా ఎరువులను ముందస్తుగానే ప్రణాళిక చేసుకొని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని పాలనాధికారి రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన వ్యవసాయ, మార్క్‌ఫెడ్, సహకారశాఖల అధికారులతో సమీక్షించారు. వానాకాలంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ రసాయన ఎరువులు 96,340 టన్నులు అవసరమని, కొరత లేకుండా ఈనెల నుంచి సెప్టెంబరు వరకు నిర్దేశించుకున్న లక్ష్యానికి అదనంగా పది శాతం అదనంగా ఎరువులు సరఫరా చేసేందుకు సంస్థలు సిద్ధంగా ఉండాలన్నారు. పీవోఎస్ యంత్రం ద్వారా గరిష్ఠ అమ్మకం ధరలకు లోబడి విక్రయించాలని ఆదేశించారు. రైల్వేమార్గం ద్వారా మెదక్, తిమ్మాపూర్, గజ్వేల్, సనత్‌నగర్, కామారెడ్డి రాక్‌పాయింట్‌ల నుంచి ఎరువులను భద్రపర్చేందుకు గోదాంలను సిద్ధంగా ఉంచాలని,



రామాయంపేటలో వెయ్యి టన్నుల సామర్థ్యం గల గోదాంను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు 40 శాతం, ప్రైవేట్ డీలర్లకు 20 శాతం, మిగిలినవి 37 ఆగ్రో రైతు సేవాకేంద్రాలకు సరఫరా చేయాలన్నారు.

వచ్చే నెల 11న నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని పాలనాధికారి ఆదేశించారు. ఆయన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. సమావేశాల్లో అదనపు పాలనాధికారి రమేశ్, జిల్లా అధికారులు ఆశాకుమారి, కరుణ, క్రాంతి, రాధాకిషన్, రాజిరెడ్డి, ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్లు, ఏవో పాల్గొన్నారు.

# వేట సమయంపై అవగాహన లేకే చేపలు మృత్యువాత..!

అశ్వాపురం : చేపలను పట్టే సమయంపై అవగాహన లేక తుమ్మలచెరువులోని అనేక క్వింటాళ్ల చేపలు నిత్యం చనిపోతున్నాయి. తెల్లవారుజామున 4గంటలకు చెరువులో వల వేస్తున్నారు. ఆ వలను ఒడ్డుకు లాగేందుకు దాదాపుగా 12గంటల సమయం పడుతోంది. సాయంత్రం 5 గంటలకు చేపలు అందుతున్నాయి. అప్పటికే సమయం మించడంతో కొన్నిటిని అమ్మి మరుసటి రోజు కోసం వలను చేపలతో సహా అలాగే చిక్కం కట్టి నీటిలో ఉంచుతున్నారు. తెల్లవారేసరికి నీటి వేడికి వలలో ఉన్న చేపలు చనిపోతున్నాయి. దీంతో వాటిని వృథాగా ఒడ్డున పారవేస్తున్నారు. ఒక్కరోజే దాదాపు 4 క్వింటాళ్ల చేపలు అలా చనిపోయి రూ.50 వేల నష్టం వాటిల్లింది. దీనిపై పరిసర గ్రామాల ప్రజలు



తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు చేపలు పడితే అందరూ ఎగబడుతున్నారని, వారు రాత్రి పూట చేపలు పడుతున్నారని ఆరోపించారు. దాంతో కొనేవారు రాక చేపలు చనిపోతున్నాయని పేర్కొన్నారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కురం నరసింహారావు మాట్లాడుతూ.. చేపలు పట్టేవారి లోపం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోం దన్నారు. రాత్రి పది, పదకొండు గంటల ప్రాంతంలో వల వేస్తే, మరుసటి రోజు ఉదయం పది గంటలకు చేపలు చేతికి అందుతాయ న్నారు. అప్పుడు కొనేవారికి, అమ్మేవారికి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని, అలా చేపలను పట్టించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

# ఇళ్లపై హైటెన్షన్ కరెంటు తీగలు

భువనగిరి : భువనగిరి పట్టణంలోని పలు ప్రధాన ఆవాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న హెచ్‌టీ విద్యుత్తు లైన్‌ను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెండు దశాబ్దాలుగా రెండు విద్యుత్తు లైన్లు విద్యానగర్, బంజారాహిల్స్, ప్రగతి నగర్, తాతానగర్ మీదుగా ఉన్నాయి. తీగలు ఇళ్లపై నుంచి వెళ్తుండటంతో ఇప్పటికే విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. 33 కేవీ హైటెన్షన్ విద్యుత్తు లైన్ ఒకటి హన్మాపురం సబ్‌స్టేషన్ నుంచి భువనగిరి సబ్‌స్టేషన్ వరకు ఉంది. మరొకటి భువనగిరి నుంచి బీబీనగర్ వైపు వెళ్తుంది. వందలాది ఇళ్ల మీదుగా విద్యుత్తు లైన్లు కొనసాగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవాస ప్రాంత వాసి మహ్మద్ లయీఖ్ అహ్మద్ అన్నారు. డాబాలపైకి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి లైన్లను మార్చాలని డిమాండ్ చేశారు ఈ విషయమై డిస్కం పట్టణ ఏఈ హరినాథ్‌ను వివరణ కోరగా ఆవాస ప్రాంతాల మీదుగా సుమారు 4 కిమీల పొడవు విద్యుత్తు లైను ఉందని, వీటిని తొలిగించేందుకు రూ.4.5 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి లైన్లు తొలగిస్తామని వివరణ ఇచ్చారు.

# తొలగింపులే.. చేర్పుల్లేవ్!

గద్వాల :ధరూరు మండలానికి చెందిన కృష్ణవేణి వివాహం కావడంతో అత్తారింటికి వెళ్లారు. స్వగ్రామంలోని రేషన్ కార్డులో పేరు తొలగించి అత్తారింటి కుటుంబసభ్యుల కార్డులో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ అధికారులు విచారణ చేసి తొలగించారు. అత్తారింటి కార్డులో పేరు నమోదు చేయలేదు. ఫలితంగా రేషన్ కోటా కోల్పోవాల్సి వస్తోంది. కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవటంతో పుట్టింటి నుంచి మెట్టింటికి వెళ్లిన కొత్తకోడళ్లకు శాపంగా మారింది. ఇంటి పేరు మారినా రేషన్ కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో వేల మంది కొత్త కోడళ్లు పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నా అధికారులు సమాధానం ఇవ్వలేని పరిస్థితి. మూడేళ్లుగా అర్జీలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి. పేర్ల తొలగింపు ప్రక్రియ మాత్రం నిరంతరంగా కొనసాగుతోంది. పేరు నమోదుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్‌ను ప్రభుత్వం లాక్ చేయడంతో సమస్య ఏర్పడుతోంది.

వేలల్లో దరఖాస్తులు : పెళ్లి కాగానే కార్డుల నుంచి పేర్లు తొలగించాలని కొందరు యువతులు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. వారి పేరుతో మీద ఉన్న యూనిట్‌ను అధికారులు తొలగిస్తున్నారు. అత్తారింటి కార్డులో పేరు చేర్చే ఆప్షన్ లేకపోవటంతో కొందరు తొలగింపునకు ఒప్పుకోవటం లేదు. సదరు కార్డులు అలాగే కొనసాగుతుండగా పలు గ్రామాల్లో పేర్లు తొలగించాలని తహసీల్దార్లకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ మేరకు విచారణ చేసి తొలగిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో ఒక్క పేరు కూడా చేర్చలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 9.35 లక్షల వరకు కార్డుదారులున్నారు. మూడేళ్లలో పేరు నమోదుకు నిరీక్షిస్తున్న వారి సంఖ్య 18,300 వరకు ఉన్నారు. కొత్తగా పెళ్లై.. వేరుకాపురం ఉంటున్న వారు కొత్తకార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల సంఖ్య వేలల్లో ఉంది.

ప్రత్యేక కార్యక్రమం పేరుతో తొలగింపు : ఐదేళ్లలో మరణించిన వారి పేర్లు ఇంకా కొనసాగుతుండటంతో యూనిట్ల సంఖ్య అలాగే ఉండటం వల్ల రేషన్ పక్కదారి పడుతోందని గ్రహించిన ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కొత్తగా పెళ్లయిన వారు, మృతి చెందిన వారి వివరాలు పరిశీలించి తొలగిస్తున్నారు. అత్తారింటికి కార్డులో పేరు చేర్చుకునే అవకాశం ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పెళ్లయిన వెంటనే పేరు తొలగింపునకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత గిర్దావర్ విచారణ చేసి తహసీల్దార్ లాగిన్‌కు పంపిస్తారు. పేరు తొలగించినట్లు తహసీల్దార్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తీసుకోని డీఎస్వో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. విచారణ చేసి పేరు చేరుస్తారు. దీనికి కమిషనరేట్ నుంచి ప్రత్యేక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కూడా అత్తారింటికి ఉన్న కార్డులో మాత్రమే పేరు చేరుతుంది. కొత్తగా పెళ్లయిన జంటకు మాత్రం కార్డు జారీ అయ్యే అవకాశం లేదు. ప్రభుత్వం ఆప్షన్ ఇస్తే పరిశీలించి నమోదు చేస్తామని గద్వాల జిల్లా ఆర్డీవో రాములు చెపుతున్నారు.

# మహిళలకు రుణాలు.. ఉపాధి వెలుగులు



భూపాలపల్లి : మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.. గ్రామ మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తోంది.. వ్యాపార రంగంలో ఎదగడానికి ప్రోత్సహిస్తోంది. అతివలు కూడా రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించడంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతోంది.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2034.31 కోట్లను రుణాలుగా అందించేందుకు ప్రణాళిక సిద్ధమైంది.. బ్యాంకు లింకేజీ ద్వారా అందించే ఆర్థిక సహాయంతో మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అయ్యేందుకు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. కిరాణం, టైలరింగ్, దుస్తుల విక్రయ కేంద్రం, వ్యవసాయం, పాడి పశువుల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లు నెలకొల్పేందుకు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రోత్సహించడంతో పాటు తీసుకున్న రుణాలను ఏవిధంగా పెట్టుబడికి వినియోగించుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. స్వయం ఉపాధి రుణాలు పొందడంతో పాటు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించేలా ఏపీఎం, సీసీ స్థాయి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

గత ఏడాది ఇలా..ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి 51,985 స్వయం సహాయక సంఘాలకు రూ.2419.38 కోట్ల రుణాలను అందించాలని లక్ష్యం నిర్దేశించుకొని వంద శాతం రుణాల పంపిణీ చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 45,105 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2034.31 కోట్ల రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు అందిస్తున్నా మరోవైపు స్త్రీ నిధి ద్వారా అనుకున్న లక్ష్యం నెరవేరడంలో వెనుకబడుతోంది. స్త్రీనిధి లక్ష్యం వంద శాతం నెరవేరడానికి అధికారులు చర్యలు తీసుకుంటే.. మహిళా సంఘాలకు మరింత ఆర్థిక తోడ్పాటు అందించినట్లు అవుతుందని, ఆ దిశగా అధికారులు ప్రయత్నం చేయాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వందశాతం రుణాలు అందిస్తాం- పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిజిల్లా వ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏటా లక్ష్యం మేరకు రుణాలు అందిస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ రుణాలు వంద శాతం అందిస్తాం. ఇప్పటి నుంచే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తక్కువ వడ్డీకి రుణాలు పొందిన మహిళలు వాటిని వృథా చేయకుండా ఆర్థికంగా ఎదగడానికి వినియోగించుకోవాలి.

# రెండు అడుగులు వెనక్కి..!

భూపాలపల్లి : పదో తరగతి ఫలితాలు జిల్లాకు నిరాశను మిగిల్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం కంటే ఈసారి ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని భావిస్తే.. మరింత తగ్గాయి. గత సంవత్సరం జిల్లా ఉత్తీర్ణత రాష్ట్రంలో 20 స్థానంలో ఉండగా ఈసారి 22వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం ఉత్తీర్ణత 91.49 శాతం ఉండగా ఈసారి 85.54 వచ్చింది. జిల్లాలో బాల బాలికలు మొత్తం 8,449 మంది పరీక్షలు మంది రాయగా వారిలో 7,227 మంది ఉత్తీర్ణులు కాగా బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లాలోని 13 పాఠశాలలు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. గత సంవత్సరం వీటి సంఖ్య 21 ఉండగా ఈసారి తగ్గాయి. 13 పాఠశాలల్లో జడ్పీ ఉన్నత పాఠశాలలు 10, కేజీబీవీలు 02, మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాల ఒకటి ఉంది. గత ఏడాది ఒక ఆదర్శ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత రాగా ఈసారి ఒక్కటి కూడా రాలేదు.

ఆరు పాఠశాలల్లో రెండోసారి..!

ఈసారి పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించిన 13 పాఠశాలల్లో ఆరు పాఠశాలలు రెండోసారి కూడా ఈ ఘనతను నిలబెట్టుకున్నాయి. గంగారం, పెద్దవంగర కేజీబీవీలు, బత్తులపల్లి, ఓటాయి వీఎస్ లక్ష్మీపురం, రామాస్ ఉర్దూ మాధ్యమ పాఠశాలలు గత సంవత్సరంలో కూడా వంద శాతం ఉత్తీర్ణతను సాధించాయి. రెండు కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్య 50లోపు ఉంది. రామాస్ పాఠశాలలో కేవలం ఒకరు, లక్ష్మీపురం పాఠశాలలో 20లోపు మిగతా మూడు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పదిలోపే ఉంది. జిల్లాలో వివిధ యాజమాన్యాల 209 ఉన్నత పాఠశాలలకు చెందిన 7,227 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 85.54గా నమోదైంది. ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే మినీ గురుకులాల్లో ఎక్కువగా ఉంది. జిల్లాలో ఈ పాఠశాలలు మూడు ఉండగా ఉత్తీర్ణత శాతం 97.38 నమోదైంది.

కరోనా కాలంలోనే వంద శాతం!

గత విద్యాసంవత్సరాల్లో జిల్లాలో పదో తరగతి ఫలితాలను పరిశీలిస్తే ఒకసారి ఉత్తీర్ణత శాతం పెరుగుతూ మరోసారి తగ్గుతూ వస్తోంది. 2019-20, 2020-21 విద్యాసంవత్సరాల్లో కరోనా నేపథ్యంలో పరీక్షలు నిర్వహించకుండా అందరినీ ఉత్తీర్ణులు చేయడం వల్ల వంద శాతం ఉత్తీర్ణత నమోదయింది.

పెద్దకిష్టాపురంలో సున్నా ఫలితాలు!

గార్ల, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఉన్న 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 232 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా వీరిలో 157 మంది ఉత్తీర్ణులయ్యారు. జడ్పీఎస్ఎస్ మద్దివంచలో నలుగురు పరీక్షలు రాయగా నలుగురు ఉత్తీర్ణులయ్యారు. పెద్దకిష్టాపురం ఉన్నత పాఠశాలలో మొత్తం పది మంది పరీక్షలు రాయగా సున్నా ఫలితాలు వచ్చాయి.

ఉత్తీర్ణులైన విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కలెక్టర్ కె.శశాంక ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విజయానికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

పకడ్బందీ ప్రణాళికతో సాగుతాం- డీఈఓ రామారావు

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు 2022-23 విద్యా సంవత్సరంలో విశేష కృషి చేశాం. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంలో అన్ని విధాల సహాయ, సహకారాలను అందజేశాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశాం. వచ్చే విద్యా సంవత్సరంలో సమష్టి కృషి, పకడ్బందీ ప్రణాళికతో సాగుతాం. జిల్లాను ఫలితాల్లో రాష్ట్రంలో ఉన్నత స్థానంలో నిలబెడుతాం.

'పది'లో బాలికలదే హవా

పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. వరంగల్ జిల్లా రాష్ట్రంలో పదహారో స్థానంలో నిలిచింది. మొత్తం 9,710 మంది విద్యార్థులు హాజరవగా,.8,701 మంది (89.61 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అమ్మాయిలు సత్తా చాటారు. బాలురు 5,003 మందికి 4,447 మంది (88.89 శాతం), బాలికలు 4,707 మందికి 4,254 మంది (90.38 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 61 మంది విద్యార్థులు పది జీపీఏ సాధించారు. జిల్లాలో మొత్తం 69 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో 26 ప్రభుత్వ, 43 ప్రైవేటువి ఉన్నాయి.

# దండిగా అనుమతి లేని వ్యాపారం




సూర్యాపేట : జిల్లాలోని పురపాలికల్లో ఆశించిన స్థాయిలో ట్రేడ్ లైసెన్సులను వ్యాపారులు తీసుకోవడం లేదు. దీంతో ఆదాయానికి ఏటా లక్షల్లో గండిపడుతోంది. ఏ దుకాణం నడపాలన్నా పురపాలికల నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలి. కానీ, జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు అనుకున్న లక్ష్యానికి ఇంకా దూరంగానే ఉన్నాయి. జిల్లాలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు మొత్తం 5,340 దుకాణాలకు 3,086 ట్రేడ్ లైసెన్సులు పొందారు. ఎక్కువగా 2500 సూర్యాపేటలో, అతి తక్కువగా హుజూర్‌నగర్‌లో పది మంది మాత్రమే వ్యాపార అనుమతిని తీసుకున్నారు. వాస్తవానికి పట్టణంలో గత రెండేళ్లతో పోలిస్తే విపరీతంగా దుకాణాలు పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య, సంస్థలు పెరిగిపోతున్నా నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సులు పొందటం లేదు.

విలీన గ్రామాల్లో అంతంతే..!జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల పురపాలికల్లో చుట్టుపక్కల గ్రామాలు విలీనమయ్యాయి. పట్టణానికి దగ్గరగా ఉండటంతో గతంలో ఉన్న వాటికి రెట్టింపు సంఖ్యలో కొత్త దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు వెలిశాయి. ఇందులో చాలా వాటికి ట్రేడ్ లైసెన్సు పొందకుండానే దుకాణాలు కొనసాగుతున్నాయి.

రుసుం లెక్కలిలా..

మున్సిపాలిటీలకు ఆదాయం పెంచేలా ప్రభుత్వం ట్రేడ్ లైసెన్సులో మార్పులు చేసింది. జీవో నెంబరు 147 జారీచేసింది. దీని ప్రకారం 20 అడుగుల లోపు రోడ్డును సింగిల్ లైన్‌గా, 30 అడుగుల లోపు ఉంటే డబుల్ లైన్, 30 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్డును మల్టిపుల్ లైన్‌గా విభజించారు. ఆయా రహదారులకు ఇరువైపులా గల దుకాణాల విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు కనిష్ఠంగా రూ.3, గరిష్ఠంగా రూ.ఏడు చెల్లించి లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, చాలామంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకొనేందుకు ముందుకు రావడం లేదు. ఏదేని బ్యాంకులకు, ఇతరత్రా అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో ట్రేడ్ లైసెన్సును తీసుకుంటున్నారు.

ప్రతి దుకాణదారుడు అనుమతి తీసుకోవాలి-రామాంజులరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లోని ప్రతి దుకాణదారుడు ట్రేడ్‌లైసెన్సు విధిగా తీసుకోవాలి. లేకుంటే తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు ముందుకొచ్చి అనుమతి పొంది పురపాలిక అభివృద్ధికి సహకరించాలి.

# మక్కల ధర పతనం

సూర్యాపేట : మొక్కజొన్న ధర రోజురోజుకూ పతనమవుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు 75 బస్తాల మక్కలు వచ్చాయి. గరిష్ఠంగా రూ.1325, కనిష్ఠ ధర రూ.1203 పలికింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు కంటే క్వింటాకు రూ.637 నుంచి రూ.759 వరకు తగ్గింది. వారం రోజుల నుంచి క్రమంగా వెల పడిపోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 517 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవల ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ.1962ను మద్దతు ధరగా నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు



చేయాలని ఆదేశించింది. కానీ, అధికారులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.సాకు చూపుతూ..రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన మక్కలు నాసిరకంగా ఉన్నాయని, తేమ ఉందంటూ వ్యాపారులు సాకు చూపుతున్నారు. మండుటెండలో కష్టపడి పండించిన పంటకు వ్యాపారులు కొర్రీలు పెడుతూ నష్టపరుస్తున్నారని రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆదేశించినా వ్యాపారులు, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. రవాణా ఖర్చులు రూ.2 వేల నుంచి రూ.3వేలు భరిస్తూ నష్టపోతున్నామని, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అకాల వర్షాలకు తడవడమే కారణం

ఫసియొద్దీన్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

అకాల వర్షాలకు మొక్కజొన్న తడిసింది. అందుకే వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పై మార్కెట్‌లో ధర పతనం కావడంతో స్థానికంగా తగ్గుతోంది.

# సంచులు కదలట్లే..

కామారెడ్డి : "కడుపు నింపే అన్నదాత కష్టాల కడలి ఈదుతున్నాడు. ఆరుగాలం చమటోడ్చినా ఫలితం లేకుండా పోతోంది. ఆరంభంలో నకిలీ విత్తనాలు, ఎరువులతో నష్టపోయి పెట్టుబడి భారం మోశాడు. ఆ తర్వాత తెగుళ్లు సగం దిగుబడిని దెబ్బతీశాయి. చివరి వరకు కాపాడుకున్న పంటను ఇటీవల అకాల వర్షాలు, వడగళ్లు నిండా ముంచాయి. ఇప్పుడు వాతావరణం కాస్త కుదుటపడి కాంటా వేసినా.. ధాన్యం దించుకోవడంలో మిల్లర్లు కొర్రీలు పెడుతుండటంతో దిక్కుతోచక అల్లాడుతున్నాడు. ఆకాశంలో మేఘాలు దోబూచులాడుతుండటంతో మిగిలిన కాస్త దిగుబడులను ఎలా కాపాడుకోవాలోనని ఆందోళన చెందుతున్నాడు."

యాసంగి ధాన్యం సేకరణకు జిల్లాలో 344 కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటికే 330 కి పైన ప్రారంభించినా కేవలం 286 చోట్లనే కాంటాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటి వరకు 1.16 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. మరో మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉంది.

అన్‌లోడింగ్‌తోనే సమస్య

సేకరించిన ధాన్యం నాణ్యంగా లేదనే సాకుతో మిల్లర్లు అన్‌లోడింగ్‌కు ససేమిరా అంటున్నారు. ఫలితంగా మిల్లుల ఎదుట లారీలు బారులు తీరుతున్నాయి. ప్రభుత్వం తడిసిన ధాన్యం తీసుకోవాలని నిర్దేశించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో కేంద్రాల్లో కాంటాలు మందకొడిగా సాగుతున్నాయి. సంచులు తరలించేందుకు లారీలు రాకపోవడంతో అన్నదాతలు నాలుగు రోజులుగా నిల్వల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

వివరాలు మెట్రిక్ టన్నుల్లో

కేంద్రాల్లో కాంటా వేసింది : 1,16,032

మిల్లుల్లో అన్‌లోడ్ చేసుకున్నది : 89,470



ఇంకా చేయాల్సింది : 26,562

ఇబ్బందులు లేకుండా చర్యలుఅన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ధాన్యం నాణ్యంగా లేదనే ఉద్దేశంతో మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోవడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అదనపు పాలనాధికారి మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. కాంటా వేసిన సంచులను తరలించేందుకు ప్రత్యేకంగా లారీలు పంపించాలని ట్రాన్స్‌పోర్టర్లను ఆదేశించారు. ధాన్యం సేకరణలో వేగం పెరిగింది. రోజువారీగా మిల్లులకు పది వేల మెట్రిక్ టన్నులు తరలిస్తున్నాం.

అభిషేక్, డీఎం, పౌరసరఫరాల శాఖ

పట్టించుకోవడం లేదు- శ్రీనివాస్, వాజిద్‌నగర్, బిచ్కుంద

కాంటా వేయడానికి పదిహేను రోజులు పట్టింది. ఇప్పుడేమో సంచులు తరలించేందుకు లారీలు రావడం లేదు. వాజిద్‌నగర్‌లో నాలుగు రోజులుగా లారీలు రాక కాంటాలు నిలిచిపోయాయి. వర్షానికి సంచులు తడిసిపోయేలా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదు.

నెలరోజులకు తూకం- గంగారాం, వాజిద్‌నగర్, బిచ్కుంద

కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన నెలరోజుల తర్వాత కాంటా వేశారు. ప్రస్తుతం లారీలు రావడం లేదు. రోడ్డెక్కి ఆందోళన చేసినా అధికారులు స్పందించడం లేదు. అన్నదాతలకు అండగా నిలిచేవారే కరవయ్యారు.

# నిరుద్యోగుల ఆశలు ఆవిరి!

నిర్మల్ :భవిష్యత్తులో ఉపాధ్యాయులు కావాలన్న నిరుద్యోగుల ఆశ ఆదిలోనే ఆవిరైంది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలు చాలామందిని నిరాశపర్చాయి. పేపర్-1 పరీక్షలో కేవలం 33.37 శాతం మంది అర్హత సాధిస్తే.. పేపర్-2 పరీక్షలో 51.60శాతం మంది గట్టెక్కారు. టీచర్ ఎలిజిబులిటి టెస్ట్(టెట్) జూన్ 12న నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా పేపర్-1 పరీక్షకు 7,732 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షకు 7,566 మంది హాజరయ్యారు. ఇందులో కేవలం 2,525 మంది మాత్రమే అర్హత సాధించారు. పేపర్-2లో 3,167 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే 3,062 మంది పరీక్ష రాసి 1,580 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కాగా ఉపాధ్యాయ నియామక పరీక్షకు సన్నద్ధమవుదామనుకున్న వారికీ ఈ ఫలితాలు నిరాశను కలిగించాయి. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే 150 మార్కులకు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 60 మార్కులు(40 శాతం), బీసీ అభ్యర్థులు 75 మార్కులు(50 శాతం), జనరల్ కేటగిరీ వారు 90 మార్కులు(60 శాతం) సాధించాల్సి ఉంది. నిర్ణీత మార్కులకు ఒకటి, రెండు మార్కులు కోల్పోయి చాలామంది అర్హతను సాధించలేకపోయారు. అర్హత సాధించిన అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. టీఆర్‌టీ పరీక్షకు తక్కువ మంది పోటీదారులు ఉంటారని భావిస్తున్నారు. కష్టపడి ఎలాగైనా ఉద్యోగం సాధించవచ్చనే ధీమా వ్యక్తమవుతోంది.

జిల్లాలో 298 ఉపాధ్యాయ ఖాళీలు

టెట్ ఫలితాలు వెలువడటంతో ఇపుడు అందరి దృష్టి ఉపాధ్యాయ ఖాళీలపై పడింది. కొత్త జిల్లాలవారీగా పోస్టులు భర్తీ చేయనుండటంతో జిల్లాలో ప్రస్తుతం 298 ఉపాధ్యాయులు ఖాళీలు ఉన్నట్లుగా విద్యాశాఖ ప్రభుత్వానికి ఇది వరకే నివేదిక పంపింది. ఇందులో అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులు 203 ఉండగా.. మిగిలినవన్నీ స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, భాషాపండిత పోస్టులు ఉన్నాయి. ఈసారి బీఎడ్ వారు కూడా ఎస్జీటీ పరీక్ష రాసేందుకు అర్హులుగా పేర్కొనడంతో పేపర్-1, పేపర్-2లో అర్హత సాధించిన వారంతా పోటీపడే అవకాశముంది. అంటే 203 ఎస్జీటీ పోస్టులకు 4,105 మంది పోటీపడవచ్చు ఇతర జిల్లాల్లో రాసిన అభ్యర్థులు అర్హత సాధిస్తే.. ఇది వరకే టెట్‌లో అర్హత సాధించి ఈసారి టీఆర్టీకి హాజరైతే పోటీ మరింత పెరగవచ్చు పేపర్-2లో సబ్జెక్టుల వారీగా ఫలితాలు ప్రత్యేకంగా వెలువరించకపోవడంతో ఏ సబ్జెక్టుకు ఎంత మంది పోటీపడుతున్నారో ఇపుడే తెలిసే అవకాశంలేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

# ఫలితం.. అంతంత మాత్రమే!

నిర్మల్ :అయిదేళ్ల తర్వాత ప్రభుత్వం టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పరీక్ష నిర్వహించగా, ఆ ఫలితాల్లో అతి తక్కువ మంది అర్హత సాధించారు. వెలువడిన ఫలితాలు చాలామందికి నిరాశ కలిగించాయి. కుమురంభీం జిల్లా నుంచి పేపర్-1 పరీక్షలో కేవలం 33.60, పేపరు-2లో 49.84 శాతం మంది గట్టెక్కారు.జూన్ 12న టెట్ పరీక్ష జరిగింది. కుమురంభీం జిల్లా వ్యాప్తంగా పేపరు-1 పరీక్షకు 4822 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 4673 మంది హాజరయ్యారు. ఇందులో కేవలం 1570 మంది మాత్రమే అర్హత సాధించారు. పేపరు-2లో 2240 మంది దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2137 పరీక్షకు హాజరై, 1065 మంది అర్హత సాధించారు. ఉపాధ్యాయ నియామక పరీక్షకు సన్నద్ధమవుతామనుకున్న వారికి ఈ ఫలితాలు తీవ్ర నిరాశను కలిగించాయి. అర్హత సాధించాలంటే 150 మార్కులకు గాను ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 60 మార్కులు(40శాతం), బీసీ అభ్యర్థులు 75 మార్కులు(50) శాతం, జనరల్ కేటగిరి వారు 90 మార్కులు(60శాతం) సాధించాల్సి ఉంది. నిర్ణీత మార్కులకు ఒకటి, రెండు మార్కులు కోల్పోయిన చాలామంది అర్హతకు అడుగు



దూరంలో నిలిచిపోయారు.

కలిసొచ్చిన కోనప్ప శిబిరం..

అర్హత సాధించిన వారిలో ఎక్కువ మంది గతేడాది సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో శిక్షణ తీసుకున్నవారు ఉండటం గమనార్హం. మూడునెలల పాటు నిపుణులైన శిక్షకులతో టెట్ పరీక్షకు సంబంధించిన శిక్షణ ఇచ్చిన విషయం తెలిసిందే. కౌటాల శిక్షణ కేంద్రంలో 750 మంది, కాగజ్‌నగర్‌లో 800 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకున్నారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేశారు. అయితే ఈ టెట్ మొదటి పేపరు-1లో ఫలితాల్లో కౌటాల మండలం కేంద్రానికి చెందిన డి.మనిషా 126/150, కాగజ్‌నగర్ మండలం అందెవెల్లి నివాసి ఎ.శిరీషకు 123/150, కాగజ్‌నగర్‌కు చెందిన సి.సునిత 113/150, సాయి ప్రవీణ్ 111/150, తరుణ్ 111/150, మల్లిఖార్జున్ 111/150, వంద మార్కులు సాధించినవారు దాదాపు 15 మంది వరకు ఉన్నట్లు తెలిసింది. టెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

పోటీ తీవ్రం..: టెట్ ఫలితాలు వెలువడంతో అందరి దృష్టి ఉపాధ్యాయ ఖాళీలపై పడింది. కొత్త జిల్లాల వారీగా పోస్టులు భర్తీ చేయనుండటంతో జిల్లాలో ప్రస్తుతం 353 ఉపాధ్యాయ ఖాళీలున్నట్లు విద్యాశాఖ ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక సమర్పించింది. అందులో అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 222 ఉండగా, మిగిలినవన్ని స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, భాషాపండితుల పోస్టులు ఉన్నాయి. ఈసారి బీఈడీ వారికి కూడా ఎస్జీటీ పరీక్ష రాసేందుకు అర్హులుగా పేర్కొనడంతో పేపర్-1, పేపర్-2లో అర్హత సాధించినవారు అంతా పోటీ పడే అవకాశం ఉంది.

ఉచిత శిక్షణ ఉపయోగపడింది: మనీషాఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టెట్ శిక్షణ తీసుకున్నా. నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణతోపాటు, స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఆ శిక్షణ ద్వారానే మంచి మార్కులు డి.మనిషా (126/150) సాధించా. ఎమ్మెల్యే కోనప్ప దంపతులకు రుణపడి ఉంటా.

# అరకొర నిధులు.. తాత్కాలిక పనులు



నిర్మల్ : ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేశారు. ప్రతి సంవత్సరం వేసవిలోనే ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన పనులు చేయించాల్సి ఉంటుంది. వరదగేట్ల మరమ్మతులు, రబ్బరుసీల్స్ మార్చడం, మోటార్లు, బ్యాటరీలు, రేడియేటర్లు, ఇతరత్రా పరిసరాలు బాగున్నాయా లేదా సరి చూసుకోవాలి. వీటితోపాటు ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి కాలువ స్థితిగతులు పరిశీలించి అవసరమైతే తక్షణమే మరమ్మతులు చేయించాలి. నిధులలేమితో శాశ్వతంగా చేపట్టాల్సిన పనులకు పక్కన పెట్టేశారు. కేవలం శాఖాపరంగా ఉన్న నిధులతో ప్రాజెక్టుల వద్ద తాత్కాలికంగా మరమ్మతులు చేయడానికి టెండర్లు పిలిచారు. కొన్నిచోట్ల పనులు జరుగుతుండగా.. మరికొన్ని చోట్ల ఇంకా ప్రారంభించలేదు. ఇలా ఉమ్మడి జిల్లాలోని 15 ప్రాజెక్టుల వద్ద దాదాపు రూ.5 కోట్లతో తాత్కాలిక పనులు చేపడుతున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టం చేశారు. శాశ్వత పనులు చేపట్టడానికి నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు.

అటకెక్కిన ప్రతిపాదనలు

రెవెన్యూశాఖలో వీఆర్వోల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం వారిని నీటి పారుదలశాఖలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ప్రాజెక్టులు, సాగునీటి కాలువల పర్యవేక్షణకు బాధ్యతలకు అప్పగిస్తారని వెల్లడించింది. దాదాపు రెండేళ్లయినా ఇప్పటికీ వారిని నియమించలేదు. ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు జలాశయాలకు తాత్కాలిక మరమ్మతుల కింద రూ.22 లక్షలు వెచ్చించారు. శాశ్వతంగా పనులు చేయడానికి నిధులు మంజూరు లేక ప్రాజెక్టుల వద్ద పనులు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. తగినంత సిబ్బంది లేక ఇబ్బందిగా మారింది. కాలువల మరమ్మతుల్లేక చాలా చోట్ల ఆనవాళ్లు కోల్పోయాయి. మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపెల్లి, నీల్వాయి, రాళ్లవాగు, గొల్లవాగు ప్రాజెక్టుల మరమ్మతులు, కాలువల స్థిరీకరణకు ఈసారి నిధులు మంజూరు కాలేదు. చిన్న చిన్న మరమ్మతులకు శాఖాపరమైన నిధులు వెచ్చిస్తున్నారు. ఒక్కో ప్రాజెక్టు పరిధిలో 20 నుంచి 30 మంది సిబ్బంది బదులు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. వానాకాలం దృష్ట్యా ఒక్కో జలాశయం కింద తాత్కాలిక పద్ధతిన నలుగురు సిబ్బందిని నియమించారు. కుమురంభీం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం పహాడి గ్రామం వద్ద వట్టివాగు ప్రాజెక్టును 1998లో నిర్మించారు. ఈ జలాశయం ద్వారా ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాల్లోని 23 గ్రామాల్లో 24,500 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం ఉన్నా.. కాలువలు అధ్వానంగా ఉండటంతో నాలుగైదు వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదు. ఈ జలాశయం కుడి, ఎడమ కాలువల ఆనవాళ్లు కోల్పోయాయి. కుమురంభీం ప్రాజెక్టు కాలువల పరిస్థితీ అంతే. ఇక్కడా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిర్మల్ జిల్లాలోని స్వర్ణ ప్రాజెక్టు వద్ద ఆరుగురు సిబ్బంది అవసరం ఉన్నా ఇద్దరు మాత్రమే ఉన్నారు. పగలు విధులు నిర్వర్తించి రాత్రి ఇళ్లకు వెళ్తున్నారు. రాత్రి ప్రాజెక్టు వద్దకు ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు జూన్ 17న రూ.50 వేలకుపైగా విలువచేసే రేడియేటర్, బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. స్వర్ణతోపాటు కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల నిర్వహణకు దాదాపు 80 మంది ఉండాల్సి ఉండగా.. కేవలం అయిదుగురు మాత్రమే ఉన్నారు. తగినంత సిబ్బంది లేక సాగునీటి కాలువలను చూసే వారు కరవయ్యారు.

నిధులు, సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు పంపించాం : - రామారావు, ఈఈ, నీటి పారుదలశాఖ, నిర్మల్

ప్రాజెక్టుల మరమ్మతులు, సాగునీటి కాలువల లైనింగ్, ఇతరత్రా పనులు చేపట్టడానికి అవసరమైన నిధులు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రాజెక్టు వద్ద ఉండాల్సిన సిబ్బంది, సాగునీటి కాలువల పర్యవేక్షణకు సిబ్బంది నియామకం చేపట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిన తర్వాత వారని నీటి పారుదలశాఖకు కేటాయిస్తామని ప్రకటించినా ఇంకా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ప్రస్తుతం శాఖాపరంగా ఉన్న నిధులతో ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతు పనులు చేయిస్తున్నాం.స్వర్ణ ప్రాజెక్టు ప్రధాన కాలువగా పిలుచుకునే జౌళినాల అధ్వానంగా మారింది. సారంగాపూర్ మండలం బోరిగాం గ్రామ సమీపంలో ఈ నాలలో పిచ్చిమొక్కలు పెరిగి నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రాజెక్టు ప్రారంభం నుంచి అయిదారు కిలోమీటర్ల మేర ఈ కాలువ పూర్తిగా దెబ్బతింది. ఇరువైపులా లైనింగ్ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ గండ్లు పడుతున్నాయి.

# ఏజెంట్ల మోసం.. గల్ఫ్‌లో వనవాసం



నిర్మల్ : గల్ఫ్ దేశాలంటే ఇక్కడి ప్రజలకు తెలియని వారుండరు.. పరిచయం లేని కుటుంబం ఉండదు.. కొందరు అదృష్టం పంచన చేరితే ఎందరో దురదృష్టానికి చిరునామాలు అవుతున్నారు.. కష్టాలొస్తే కాసింత ఓదార్చేవారే కానీ శాశ్వతంగా ఆ ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన వారు లేరు. సంవత్సరాలుగా వెంటాడుతున్న పేదరికాన్ని దూరం చేసుకుందామని.. కుటుంబాన్ని ఆనందంగా ఉంచాలని.. తలకు మించిన అప్పులు చేసి ఎన్నెన్నో ఆశలతో ఆ దేశాలకు వెళ్లి తిరిగొచ్చి మళ్లీ వెళ్లిన వారిలో కొంతమంది ఏజెంట్ 'వల'లో చిక్కి ఇరుక్కుపోతున్నారు. వారికిసరైలు వీసాలు లేకపోవడంతో అక్కడి కంపెనీలు తీసుకోడం లేదు. బయటపనులు దొరకక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉద్యోగం పేరు చెప్పి. ఇతర పనులు...మాయమాటలు చెబుతూ ఏజెంట్ల వలలో ఎంతో మంది బాధితులు చిక్కుకుంటున్నారు. గల్ఫ్ దేశాల్లో మంచి కంపెనీల్లో మంచి ఉద్యోగం కల్పిస్తామని ఆశ చూపించి అక్కడెల్లిన తర్వాత గొర్రెలు మేపడం, మరుగుదొడ్లు శుభ్రం చేయడం వంటి పనులు అప్పజెప్తున్నారు. రూ. లక్షలు అప్పులు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లినా అక్కడ తినడానికి తిండిలేక, ఉండటానికి గూడులేక, పనిదొరక్క, అక్కడి ప్రభుత్వాలు విధించిన చట్టాల కారణంగా కొందరు మానసికంగా కుంగిపోయి అనారోగ్యంతో, గుండెపోటుతో మరణిస్తుండగా మరికొంత మంది ఉట్టి చేతులతో స్వగ్రామాలకు చేరుతున్నారు. ఇంకొందరు అక్కడే విగత జీవులుగా అజ్ఞాతవాసంలో ఉంటుండగా మరికొంత మంది అక్కడి జైళ్లలో మగ్గుతున్నారు.

ఓ బాధితుడి గోడులక్ష్మణచాంద మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి సంవత్సరం క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. తెలిసిన ఏజెంటుకు రూ. 60వేలు చెల్లించాడు. దుబాయ్ వెళ్లిన తరువాత పనిచేసే కంపెనీలో రెండు నెలల తర్వాత వీసా ఇస్తుందని నమ్మించి పంపించాడు. ఏజెంటును నమ్మి దుబాయ్ వెళ్లి పనిలో కుదిరాడు. మూడు నెలలు గడిచినా కంపెనీ వీసా ఇవ్వలేదు. వేతనం ఇవ్వకుండా కాలయాపన చేయటంతో తనతోపాటు అక్కడ పనిచేసే వారు ఇబ్బందులకు గురయ్యారు. చివరికి ఆ కంపెనీ తీసేశారు. మరో కంపెనీలో చేరినా అతితక్కువ వేతనం ఇచ్చారని బాధితుడు వాపోయాడు. ప్రస్తుతం బయట పనులు చేసుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.

బృందంగా వెళ్లారు.. మోస పోయారు..నిర్మల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు మిత్రులు గల్ఫ్ వెళ్లి డబ్బులు సంపాదించుకుందామని ఓ ఏజెంటును సంప్రదించారు. మంచి కంపెనీ, చక్కని జీతం ఉంటుందని నమ్మించిన ఏజెంటు ఒక్కొక్కరి నుంచి రూ.70 వేలు తీసుకున్నాడు. అక్కడికి వెళ్లిన తరువాత కంపెనీ వసతి కల్పిస్తుందని, మూడు నెలల్లో వీసా వస్తుందని నమ్మించి పంపించాడు. అక్కడికి వెళ్లిన తరువాత మూడు నెలలు గడిచినా కంపెనీ వీసా రాలేదు. ఆ కంపెనీ వీసా ఇవ్వదని తెలుసుకొని మోసపోయారు. చేసేదేం లేక ఏవోచోట్ల పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు.

ఇదీ గల్ఫ్ ముఖచిత్రం.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు గల్ఫ్ దేశంలోని యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, ఖతర్, బహెరాన్, తదితర దేశాల్లో 60 వేల మందికిపైగా ఉన్నారు. ఉపాధి కోసం వెళ్లిన వారిలో చాలా మంది సాంకేతిక పరిజ్ఞానం లేని వారు, శిక్షణ, అనుభవం లేని వారే ఎక్కువ. కూలీలుగా వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్న వారు దాదాపు 8 వేల మంది వరకు ఉన్నారు.నకిలీ ఏజెంట్ల మోసాల బారిన పడి రూ. లక్షల్లో మోసపోయిన వారు వందల సంఖ్యలో ఉంటారు. ప్రవాసులకు సంబంధించిన వివరాలు ఇప్పటికీ లేవు. గ్రామ గ్రామాన సర్వే నిర్వహించి సమాచారాన్ని సేకరించాలి.సందర్శక వీసాపై వెళ్లి అక్కడే ఉన్న వారు: 08 వేల వరకుస్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లలేని వారు: 15 వేల వరకు గల్ఫ్‌లో ఉన్న ఉమ్మడి జిల్లా వాసులు : 60 వేలు

కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసిమిత్ర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

బాధితులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఉపయోగపడే గల్ఫ్ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి. చట్టబద్ధంగా ఏర్పడే ఈ బోర్డు ప్రభుత్వాలు మారినా అలాగే ఉంటుంది. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న కార్మికులతో పాటు ఇక్కడున్న వారి కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలి. బాధితులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్న ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలి.

# చిత్ర విచిత్రం.. రెవెన్యూ ధ్రువపత్రం

ఆసిఫాబాద్ : జిల్లా రెవెన్యూశాఖలో పాలన గాడి తప్పింది. కంప్యూటర్ ఆపరేటర్లు, కొందరు అధికారులు, దళారులు కుమ్మక్కై అందినంత దండుకుని ఇష్టారాజ్యంగా ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ధ్రువపత్రం (డిఫెండెంట్) పత్రాల జారీలోనూ వీరు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక పాసు పుస్తకాల్లో పురుషునికి బదులు, మహిళ అని పడిన సందర్భాలు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు, పట్టా భూమి నిషేధిత జాబితాలోకి వెళ్లినవి కోకొల్లలుగా ఉన్నాయి. ఉద్యోగం చేస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా చనిపోతే ఆయన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కోసం, పదవీ విరమణ చేసిన వ్యక్తులు చనిపోతే సంబంధిత కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి పింఛను పొందడానికి, భూముల క్రయవిక్రయాలకు డిఫెండెంట్ పత్రం అవసరం. జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు, సింగరేణి ఉపరితల గనులు ఉన్న ప్రదేశాల్లో ఈ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు అధికంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. వాస్తవంగా ఒక కుటుంబానికి ఒకటే ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. ఇందుకు భిన్నంగా చేయి తడిపితే ఒకే కుటంబంలో ఇద్దరు, ముగ్గురికి


GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

వీటిని జారీ చేస్తున్నారు జిల్లాలో కొందరు అధికారులు.

ఆన్‌లైన్ నిర్వాహకులతో కుమ్మక్కు..

జిల్లాలోని కొన్ని మండలాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు, కొంత మంది సిబ్బంది కుమ్మక్కై ఈ దందా నడిపిస్తున్నారు. ఇటీవలే కెరమెరి మండలంలో ముగ్గురు ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు తహసీల్దార్ లాగిన్‌ను తెలుసుకుని నకిలీ ధ్రువపత్రాలతో 32 మంది కల్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేశారు. ఇందుకు స్థానిక అధికారుల సహకారం లేదని అధికారులు చెబుతున్నా, అక్కడి కింది స్థాయి సిబ్బంది సహకరించారనేది బహిరంగ రహస్యం. కుటుంబ ధ్రువీకరణ పత్రానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఒకరికే రెండు ధ్రువీకరణ పత్రాలు జారీ

కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ విలేజ్ నంబర్ 7కు చెందిన మండల్ ప్రియావాలా (దివ్యాంగురాలు) 05.01.2021 గువ్వలగూడ గ్రామంలో మరణించారు. తండ్రి గజేంద్రనాథ్ ఆరు సంవత్సరాల క్రితమే మరణించగా, తల్లి పూలమతి సైతం అయిదు సంవత్సరాల క్రితమే మరణించింది. ప్రస్తుతం ప్రియావాలాకు సంబంధించి నలుగురు అక్కలు, ఒక సోదరుడు ఉన్నారు. వాస్తవంగా వీరందరి పేరు మీద కుటుంబ సభ్యుల ధ్రువతప్రం జారీ కావాలి. అందుకు భిన్నంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించారు. సోదరి హాల్దార్ రీటా కుటుంబ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేయగా మరొక సోదరితో పాటు, చనిపోయిన అమ్మ పేరుతో రెవెన్యూ అధికారులు 25.06.2021న కుటుంబ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు.

విచారణ చేయకుండానే..ప్రియావాలా మరణానికి సంబంధించి సోదరుడు మండల్ రాధేశ్యామ్ కుటుంబ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా, ఇదే రెవెన్యూ అధికారులు నలుగురు సోదరీమణులు, ఒక సోదరుడి పేరు జతచేస్తూ కుటుంబ సభ్యుల ధ్రువపత్రం 08.06.2022న జారీ చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విచారణ చేయకుండానే ఇష్టారాజ్యంగా ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారనడానికి ఈ ఘటనే నిదర్శనం.

అవసరమైన పనుల్లో అలక్ష్యం..

కాగజ్‌నగర్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనివాస్‌కు గ్రామ శివారులో 142/3 సర్వే నంబర్‌లో 1.03 ఎకరాల భూమి ఉంది. ఈయన పాస్‌పుస్తకంలో పురుషుడు/మహిళ కాలంలో, తెలియదు అనే పదం వచ్చింది. ఈ పదాన్ని సరిచేయడానికి ఆయన సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.

# ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ నిషేధం

ఆసిఫాబాద్ ఒకసారి వాడిపడేసిన ప్లాస్టిక్ నిషేధం శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని పాలనాప్రాంగణ సమావేశం మందిరంలో అయన అదనపు పాలనాధికారి చాహత్ బాజ్‌పాయి, జిల్లా అటవీశాఖ అధికారి దినేష్‌కుమార్‌తో కలిసి గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జులై ఒకటో తేదీ నుంచి 100 మైక్రాన్స్ కంటే తక్కువ ప్రమాణం ఉన్న అన్నిరకాల ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు. జిల్లాలో సంబంధిత అధికారులు పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరి వికాసం పనుల్లో వేగం పెంచాలన్నారు. గుర్తించిన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేట్లు చూడాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేశ్, ఆసిఫాబాద్ పంచాయతీ ఈవో వంశీకృష్ణ, అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.ఆశ్రమ పాఠశాలల్లో పీఓ ఆకస్మిక తనిఖీ మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఆరా తీశారు. తిర్యాణి మండలంలోని సూంగపూర్ శాటిలైట్ స్కూల్, గిన్నెధరి బాలికల, తిర్యాణి బాలుర ఆశ్రమ పాఠశాలలు, తిర్యాణి గిరిజన గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గిన్నెధరి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి గదికి వెళ్లి ఆంగ్ల పాఠ్య పుస్తకంలోని విద్యార్థులతో పాఠం చదివించారు. అనంతరం లెక్కలు వేసి బోర్డుపై విద్యార్థులతో తీయించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని మరుగుదొడ్లు, వంట గదులకు మరమ్మతులు చేయించాలని, ఉపాధ్యాయులకు క్వార్టర్లు కేటాయించాలని హెచ్‌ఎం స్వర్ణలత విన్నవించారు. సూంగపూర్‌లోని సమస్యలను పరిష్కరించాలని హెచ్‌ఎం జయంతరావు పీఓను కోరారు. తిర్యాణి గురుకుల పాఠశాలలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ఆటస్థలం చదును చేయించాలని, పాఠశాల ఆవరణలో సోలార్ విద్యుత్తు బల్బులు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ శారధ పీఓ దృష్టికి తీసుకెళ్లారు.



# అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్

అమరావతి: అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సీఎం జగన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి, శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర స్వామి,అవధూత పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామిజీ, మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్య, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ వేదపండితుల మంత్రోచ్ఛారణతో కూడిన సంకల్పం తీసుకొని ఆరు రోజుల క్రితం ఈ మహాయజ్ఞాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది బుధవారం పండితులు నిర్ణయించిన సుముహూర్తాన తిరిగి సీఎం జగన్ చేతుల మీదుగానే అఖండ పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిసింది. రాజశ్యామల అమ్మవారు వేంచేసి ఉన్న వైఖానస యాగశాలలో పూర్ణాహుతికి సంబంధించిన పూజా కార్యక్రమం నిర్వహించారు. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన నల్లకలువలతో వేదమంత్రోచ్ఛారణల మధ్య రుత్వికులు, ఘనాపాటిలు, పండితులు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కంచి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన స్వర్ణ ప్రతిమ రూపంలో ఉన్న అమ్మవారికి సీఎం జగన్ ప్రత్యేకంగా అభిషేకించారు.

# రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, క్షేమంగా ఉండాలి

## ప్రజలు నాపై ఉంచిన అచంచలమైన విశ్వాసానికి నేను కృతజ్ఞుడిని : ముఖ్యమంత్రి వైయస్ జగన్ ట్వీట్




తాడేపల్లి: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన శ్రీలక్ష్మీ మహాయజ్ఞం ముగింపు 'అఖండ పూర్ణాహుతి' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. యజ్ఞం ముగింపు అనంతరం సీఎం వైయస్ జగన్ ట్వీట్ చేశారు.

"ఆరు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగిన చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నేడు పూర్ణాహుతితో ముగిసింది.

వేలాది మంది ఈ యజ్ఞంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రజలు నాపై ఉంచిన అచంచలమైన విశ్వాసానికి నేను కృతజ్ఞుడిని. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందేందుకు కృషిచేద్దాం. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని సీఎం వైయస్ జగన్ ట్వీట్ చేశారు.

# పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించను: చంద్రబాబు హెచ్చరిక




అమరావతి: నంద్యాలలో 'యువగళం' పాదయాత్ర సందర్భంగా తెదేపాలోని ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్నఘర్షణ ఘటనపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. సీనియర్లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. నంద్యాల ఘర్షణ ఘటనపై సమగ్ర అధ్యయనంతో నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. తెదేపా కార్యక్రమాల్లోకి వైకాపా శ్రేణులు చొరబడి పురిగొలిపే ఘటనలు ఉంటున్నాయని.. అలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉంటూ పూర్తి సమన్వయంతో వ్యవహరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. 'యువగళం పాదయాత్ర'లో భాగంగా మంగళవారం రాత్రి నంద్యాల నియోజకవర్గంలోనికి నారా లోకేశ్‌కు ప్రవేశించిన నేపథ్యంలో కొత్తపల్లి వద్ద మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, తెదేపా నేత ఎ.వి.సుబ్బారెడ్డి వర్గాలు స్వాగత ఏర్పాట్లు చేశాయి. అదే సమయంలో ఇరువర్గాల మధ్య తలెత్తిన వాగ్వాదం.. ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో ఎ.వి.సుబ్బారెడ్డిని అఖిలప్రియ వర్గీయుడు కొట్టడం.. ఆయన ముక్కు నుంచి రక్తం కారడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అక్కడే ఉన్న అఖిలప్రియ, ఇతర నాయకులు, పోలీసు అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అయితే బుధవారం ఉదయం అఖిలప్రియను పోలీసులు అరెస్ట్ చేసి పాణ్యం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ పరిణామాల నేపథ్యంలో త్రిసభ్య కమిటీని చంద్రబాబు ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# తుది తీర్పునకు లోబడే ఆర్-5జోన్‌లో పట్టాల పంపిణీ: సుప్రీంకోర్టు

దిల్లీ: అమరావతి ప్రాంతంలోని ఆర్-5 జోన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్-5జోన్‌లో పట్టాలు ఇస్తే కనుక అది తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ తీర్పునకు లోబడే పట్టాల చెల్లుబాటు ఉంటుందని తేల్చి చెప్పింది. పట్టాదారులకు థర్డ్ పార్టీ హక్కు ఉండబోదని ఉద్ఘాటించింది. రైతులు, ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. ఆర్-5 జోన్‌లో ఇప్పటికే ప్లాట్ల కేటాయింపులు జరిగాయని ప్రభుత్వం, సీఆర్డీఏ తరఫు న్యాయవాదులు పేర్కొనడంతో, ప్లాట్ల కేటాయింపుపై అభ్యంతరం చెప్పబోమంది. కానీ, మూడు రాజధానులపై హైకోర్టు రిట్ పిటిషన్ తీర్పునకు లోబడే పట్టాల చెల్లుబాటు ఉంటుందని, పట్టాదారులకు థర్డ్ పార్టీ హక్కు ఉండబోదని తేల్చి చెప్పింది. పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించిన న్యాయవాదులు రాష్ట్రం, దేశ ప్రయోజనాల కోసమే రైతులు భూములు ఇచ్చారని సుప్రీం కోర్టుకు తెలిపారు. ఒక మహానగరం వస్తుందని హామీ ఇచ్చారన్న రైతుల తరఫు న్యాయవాది.. ఉద్యోగాలు, అనుబంధ పరిశ్రమలు వస్తాయని ఆశచూపినట్టు తెలిపారు. 29 గ్రామాల ప్రజలు ఆ మాటలు నమ్మి.. ఎలాంటి ఆర్థిక పరిహారం తీసుకోకుండా వేల ఎకరాల భూములు ఇచ్చారని గుర్తు చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అధికారులు వెళ్లి అభివృద్ధిపై ప్రచారం చేశారన్నారు. మాస్టర్ ప్లాన్‌లో నవనగరాలు ప్రతిపాదించారన్న న్యాయవాది... అవి అభివృద్ధి చెందితే ఎన్నో అవకాశాలు వస్తాయన్నారు. ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రూపు రేఖలు మారతాయన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి 5శాతం భూములు ఇవ్వాలన్న రైతుల తరఫు న్యాయవాది .. రెసిడెన్షియల్ జోన్ల నిబంధనల ప్రకారం కేటాయింపులు ఉండాలన్నారు. నవ నగరాల్లోని ప్రతి నగరంలో రెసిడెన్షియల్ జోన్ ఉందన్నారు. ప్రభుత్వాలు మారితే ఇచ్చిన హామీలు పక్కన పెట్టలేరన్నారు. కోర్టు తీర్పులకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని గట్టిగా వాదించారు.

**అంతకు ముందే పట్టాలిస్తే ఇక చేయడానికి ఏముంటుంది? :** జులైలో తుది విచారణ జరగాల్సి ఉందన్న రైతుల తరఫు న్యాయవాది.. అంతకు ముందే పట్టాలు ఇస్తే ఇక చేయడానికి ఏముంటుందని ప్రశ్నించారు. ఈ సమయంలో విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు వాదనలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఏపీ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. 2023 మార్చి 21న ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆయన కోర్టుకు తెలిపారు. 34వేల ఎకరాల్లో 900 ఎకరాలే అంటే 3.1శాతమే ఈ డబ్ల్యూఎస్‌కి ఇచ్చారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో ఆర్-5జోన్‌పై ఉన్న కేసులన్నీ వ్యక్తిగతంగా వేసినవేనన్న సింఘ్వీ.. వీటిలో ఏవీ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కావన్నారు. ఆర్-5జోన్‌లో ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, వారి తరఫునే తాము వాదిస్తున్నామన్నారు. కావాలంటే ఎలక్ట్రిక్ సిటీకి మరో 900 ఎకరాలు కేటాయించుకోవచ్చని చెప్పారు.

ఆర్-3జోన్‌లో మాత్రమే భూమి తీసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎలక్ట్రిక్ సిటీకి ఇచ్చిన 6,500 ఎకరాల్లో 900 ఎకరాలు తీసుకోవద్దంటే ఎలా? అని సింఘ్వీ ప్రశ్నించారు.




ఆళ్లగడ్డ: మాజీ మంత్రి, తెదేపా నేత భూమా అఖిలప్రియను పోలీసులు అరెస్ట్ చేశారు. 307 సెక్షన్ కింద ఆళ్లగడ్డలో ఆమెను అరెస్ట్ చేసి పాణ్యం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం నంద్యాల నియోజకవర్గంలోకి ప్రవేశించింది.

ఈ సందర్భంగా లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు అఖిలప్రియ, తెదేపా నేత ఎ.వి.సుబ్బారెడ్డి వర్గాలు కొత్తపల్లి గ్రామం దగ్గర భారీ ఎత్తున ఏర్పాట్లు చేశాయి. ఇరువర్గాల మధ్య కొంతకాలంగా వర్గపోరు, విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అఖిలప్రియ వర్గీయుడు ఎ.వి.సుబ్బారెడ్డిని కొట్టడంతో ఆయన ముక్కు నుంచి రక్తం కారింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ఆ తర్వాత అక్కడే ఉన్న అఖిలప్రియ, ఇతర నాయకులు, పోలీసు అధికారులు క్షణాల్లో జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో వివాదం అప్పటికి సద్దుమణిగింది. ఈ ఘటన నేపథ్యంలోనే అఖిలప్రియను పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.




దిల్లీ: సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మూడు రిజర్వాయర్ల నిర్మాణాలపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (%చీ+ు%) విధించిన స్టే ఎత్తివేతకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. గాలేరు నగరి సుజల స్రవంతి, హంద్రీనీవా సుజల స్రవంతి అనుసంధానంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేపడుతున్న ఆవులపల్లి, నేతిగుట్టపల్లె, ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనుల్ని వెంటనే ఆపాలని గతంలో ఎన్జీటీ గతంలో ఆదేశాలు జారీచేసింది. ప్రాజెక్టు పనుల్లో ఉల్లంఘనలపై రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధించింది. దీన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఎన్జీటీ విధించిన స్టే ఎత్తివేతకు నిరాకరించింది. అయితే జరిమానాపై పాక్షికంగా స్టే ఇచ్చింది. ప్రస్తుతం కృష్ణా బోర్డుకు రూ.25కోట్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.




దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ తన పిటిషన్‌ను విచారించేలా ఆదేశించాలని కోరారు. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానంలో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం ముందు అవినాష్ తరఫు లాయర్లు ఈరోజు మెన్షన్ చేశారు.

అయితే అవినాష్‌కు సుప్రీంలో ఊరట దక్కలేదు. విచారణ తేదీని సీజేఐ ధర్మాసనం ఖరారు చేయలేదు. విచారణ అత్యవసరమైతే రాతపూర్వక అభ్యర్థన ఇవ్వాలని.. దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచించారు. ఈ హత్య కేసు దర్యాప్తులో మంగళవారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. విచారణకు హాజరుకావాలని ఈ కేసులో సహనిందితుడు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ అధికారులు ఇది వరకే నోటీసులు జారీ చేశారు. అయితే హైదరాబాద్‌లో అందుబాటులోనే ఉన్నా విచారణకు రాలేనని చివరి నిమిషంలో ఆయన సీబీఐకి సమాధానమివ్వడం.. ముందస్తు కార్యక్రమాలను కారణంగా చూపుతూ కడపకు బయలుదేరి వెళ్లడం.. అంతే వేగంతో సీబీఐ బృందం కడపకు చేరుకోవడం.. అవినాష్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఈ నెల 19న విచారణకు రావాలంటూ డ్రైవర్‌కు నోటీస్ ఇవ్వడం లాంటి పరిణామాలు ఉత్కంఠ రేకెత్తించాయి. వివేకా హత్య కేసు దర్యాప్తు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో సీబీఐ అధికారులు విచారణలో దూకుడు పెంచారు. అనూహ్యంగా కొత్త వ్యక్తులు తెర పైకి వస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోననేది ఉత్కంఠగా మారింది.

# ఉద్యోగుల బదిలీలకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్




అమరావతి: ఉద్యోగుల బదిలీలకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి 31 వరకు బదిలీలకు అవకాశం ఇస్తూ ఆర్థికశాఖ ఆదేశాలు ఇచ్చింది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఏప్రిల్ 30 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి బదిలీ తప్పనిసరి అని, ఏప్రిల్ 30 నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తైన వారికి బదిలీకి అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గిరిజన ప్రాంతాల్లో భర్తీ చేశాక ఇతర ప్రాంతాలపై దృష్టి సారిస్తామని ప్రభుత్వం తెలిపింది. వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖలు, ఎక్సైజ్, రవాణా, వ్యవసాయ శాఖలూ బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. పాఠశాల, ఇంటర్, ఉన్నతవిద్య శాఖలకు మినహాయింపు ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ACB కేసులు, విజిలెన్స్ విచారణ ఉన్నవారి వివరాలు చెప్పాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం వర్తిస్తుందని ఆర్థికశాఖ పేర్కొంది.

# కొడాలి నానీని జీవితంలో అసెంబ్లీ గడప తొక్కకుండా చేయాలి: సునీల్ దియోధర్



గుడివాడ: కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గం సమస్యలపై నిర్వహించిన భాజపా ఛార్జ్‌షీట్ కార్యక్రమంలో రాష్ట్ర భాజపా ఇన్‌ఛార్జి సునీల్ దియోధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు వారికి విశిష్టత కలిగిన సంక్రాంతి పండుగను సైతం క్యాసినో, క్యాబిరే డ్యాన్స్‌లుగా మార్చేశారని, గుడివాడ యువతను కొడాలి నాని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కొడాలి నానీని జీవితంలో అసెంబ్లీ గడప తొక్కకుండా చేయాలని గుడివాడ ప్రజలకు సునీల్ దియోధర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే ఇలాంటి ఎమ్మెల్యేలను జైలుకు పంపుతామన్నారు. బూతులు మాట్లాడుతూ ఫేమస్ అయ్యాడని, ఇలాంటి ఎమ్మెల్యేల కారణంగా ఏపీ పరువుపోతోందన్నారు. అనంతరం గుడివాడ సమస్యలపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో భాజపా నేతలు ఛార్జ్‌షీట్ ఫిర్యాదు చేశారు.




## ప్రణీత.. క్యాజువల్ డ్రెస్లోనూ మెరుపులే..

టాలీవుడ్ గ్లామరస్ హీరోయిన్ ప్రణీత సుభాష్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్గా ఉండే ఈ బ్యూటీ వరుసగా తన ఫొటోషూట్స్తో అభిమానులను ఖుషీ చేస్తుంటుంది. బావ చిత్రంతో ఈ కన్నడ సోయగం తెలుగు ఆడియెన్స్కు చాలా దగ్గరైంది. మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ చిత్రంలో తన అందం అభినయంతో ఆడియెన్స్ను కట్టిపడేసింది. దీంతో టాలీవుడ్ నుంచి ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి అప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులను అలరిస్తూ వస్తోంది. అలా స్టార్ హీరోల సరసన నటించి స్పెషల్ ఇమేజ్ను సొంతం చేసుకుంది. హీరోయిన్గా తక్కువ చిత్రాల్లోనే నటించినా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకుంది. అత్తారింటికి దారేది పాండవులు పాండవులు తుమ్మెద రభస బ్రహ్మోత్సవం హలో గురు ప్రేమకోసమే వంటి చిత్రాల్లో సెకండ్ హీరోయిన్గా అలరించింది. చివరిగా ఎన్టీఆర్



కథానాయకుడులోనూ మెరిసింది. ప్రస్తుతం కన్నడ హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటోంది. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్గా ఉంటూ బ్యాక్ టు బ్యాక్ ఫొటోషూట్స్తో అదిరిపోయే అవుట్ ఫిట్లలో ఫ్యాన్స్తో పాటు నెటిజన్లను ఫిదా చేస్తోంది. సినిమాల అప్డేట్స్ ఎక్కువగా ఇవ్వకున్నా.. తన వ్యక్తిగత విషయాలను మాత్రం అభిమానులతో ఎప్పటికప్పుడు పంచుకుంటూ ఉంటుంది. అయితే తాజాగా క్యాజువల్ డ్రెస్లో కనిపించి మరోసారి యూత్ హృదయాలను కొల్లగొట్టింది. లైట్ గ్రీన్ ట్రాన్స్ ఫరెంట్ షర్ట్ వైట్ పాంట్లో కనిపించి ఆకట్టుకుంది. తన పోజులతో మతిపోగొట్టింది. ఇది చూసిన నెటిజన్లు క్రేజీగా కామెంట్లు పెడుతున్నారు. కాగా కొంతకాలం క్రితం వివాహ బంధంలో అడుగుపెట్టిన ఈ బ్యూటీ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటోంది. పెళ్లి ప్రెగ్నెన్సీ కారణంగా కాస్త బ్రేక్ వచ్చింది. 2021లో వ్యాపార వేత్త నితిన్ రాజును ప్రేమించి పెళ్లి చేసుకుంది. 2022 జూన్ 10న బెంగళూరులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చి తల్లిగా ప్రమోషన్ పొందింది. కానీ సోషల్మీడియాలో మాత్రం యాక్టివ్గా ఉంటూ అభిమానులు అలరిస్తోంది.

## ఎద అందాలతో హాట్ గా మతిపోగొడుతున్న నభా నటేష్

సౌత్ ఇండియా హాట్ బ్యూటీ నభా నటేష్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అమ్మడు కన్నడ నాట హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసి తరువాత తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ అమ్మడు సుదీర్ బాబు హీరోగా వచ్చిన నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. తరువాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుసగా సాయి ధరమ్ తేజ్ బెల్లంకొండ శ్రీనివాస్ నితిన్ కి జోడీగా సినిమాలలో నటించింది. అయితే ఈ బ్యూటీకి తెలుగులో అవకాశాలు భాగానే లభించిన అనుకున్న సక్సెస్ మాత్రం రాలేదు. దీంతో అవకాశాలు తగ్గిపోయాయి. అయితే ఆ మధ్యకాలంలో ఓ ప్రమాదం కారణంగా కొన్ని నెలల పాటు ఆమె కంప్లీట్ గా బెడ్ కె పరిమితం అయ్యింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియాలో తెలియజేసింది. ఇక తన చేతికి



తగిలిన గాయాన్ని కూడా చూపించింది. అయితే ఇప్పుడు కోలుకొని మునుపటి అందం సొంతం చేసుకోవడంతో తిరిగి అవకాశాల వేటలో పడింది. ఫోటోషూట్ లతో హీట్ పెంచుతుంది. అలాగే తన అందాలతో దర్శకులని టెంప్ట్ చేసే ప్రయత్నం చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుల ఈవెంట్ లో పాల్గొనడానికి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె కాస్ట్యూమ్స్ స్టైలిష్ గా ఉంటూనే అందాలు ఎంత వరకు చూపించాలో అంత వరకు కనిపించే విధంగా ఉంది. ఈ స్టైలిష్ షూట్ లో నభా ఎద అందాలతో చూపిస్తూ చూపరుల మతి పోగొట్టింది. సరైన గ్లామర్ రోల్స్ పడితే నభా నటేష్ ని ఆపడం కష్టం అనే మాట వినిపించింది. అయితే టాలీవుడ్ దర్శకులు మాత్రం నభా నటేష్ అందాన్ని సరైన విధంగా ప్రేక్షకులకి కనువిందు చేసే స్థాయిలో చూపించలేదనే చెప్పాలి. అయితే నభా ఇన్స్టాగ్రామ్ లో మాత్రం నభా అందాలని తనివితీరా ఆశ్వాదించడానికి కావాల్సినన్ని హాట్ ఫోటోలు ఉంటాయి. ఆ ఫోటోలని చూడాలంటే మీరు కూడా ఆమె ఇన్స్టాగ్రామ్ ఫలోవర్స్ గా మారిపోవాల్సిందే.

# క్యూట్ పప్పీస్ తో ప్రభాస్ క్యూటీ



మహేష్ బాబు '1 నేనొక్కడినే' సినిమా తో హీరోయన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ క్రితి సనన్. తెలుగు లో ఈ అమ్మడు మొదటి సినిమా తో ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కృతి సనన్ బాలీవుడ్ లో సినిమాల వైపు అడుగులు వేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్.. క్రేజీ హీరోయిన్ గా కృతి సనన్ దూసుకు పోతుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ ఏడాది ఈమె నటించిన నాలుగు అయిదు సినిమాలు విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. హీరోయిన్ గా ఇంత బిజీగా ఉన్నా కూడా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా హాట్ ఫొటోలు షేర్ చేస్తూ సందడి చేస్తూనే ఉంటుంది. ఇన్ స్టా లో ఈ అమ్మడి యొక్క ఫాలోవర్స్ సంఖ్య 52 మిలియన్స్ పైనే. రెగ్యులర్ గా తన ఫాలోవర్స్ కోసం ఈ అమ్మడు హాట్ అందాల ఆరబోతతో పాటు అప్పుడప్పుడు ఇలాంటి క్యూట్ ఫొటోలు షేర్ చేస్తోంది. త్వరలో ఈ అమ్మడు ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే. తాజాగా ఈ అమ్మడు క్యూట్ పప్పీస్ తో ఉన్న తన క్యూట్ ఫొటోను షేర్ చేసింది. పెద్దగా మేకప్ లేకుండా నాచురల్ స్టైల్ తో చాలా క్యూట్ గా కృతి సనన్ ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య ఈ అమ్మడు ప్రభాస్ తో ప్రేమలో ఉందనే వార్తలు జోరుగా వచ్చాయి. ఇద్దరి మధ్య వ్యవహారం కాస్త ఎక్కువ దూరం వెళ్లిందని.. పెళ్లి చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. ఆ వార్తలను కృతి సనన్ కొట్టి పారేసింది. అన్ స్టాపబుల్ షో లో బాలకృష్ణ సాక్షిగా ప్రభాస్ కూడా ఆ పుకార్లను కొట్టి పారేశాడు.

# రష్మిక.. ఇంతలా శ్రమిస్తుందా?



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ రష్మిక ప్రస్తుతం టాప్ హీరోయిన్ గా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తెలుగులో పుష్ప సీక్వెల్ తో ఈ అమ్మడు మరోసారి తన సత్తా నిరూపించుకోవాలని భావిస్తుంది. ఇక హిందీలో యానిమల్ మూవీలో రణబీర్ కపూర్ కి జోడీగా నటిస్తుంది. ఆ సినిమా మీద రష్మిక చాలా హోప్స్ పెట్టుకుంది. యానిమల్ హిట్ అయితే బాలీవుడ్ లో కూడా జెండా పాతేయవచ్చని అనుకుంటుంది. ఇక రీసెంట్ గా సంక్రాంతి బరిలో వారసుడు సినిమాతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఇదిలా ఉంటే కోలీవుడ్ లో కొన్ని పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయి. ఇక రష్మిక ఎంత హాట్ గా ఉంటుందో అంత ఫిట్ గా ఉంటుంది అనే సంగతి అందరికి తెలిసిందే. సౌత్ లో సమంత తర్వాత అంతగా ఫిట్ నెస్ మెయింటేన్ చేసేది మాత్రం కచ్చితంగా రష్మిక అని చెప్పాలి. పెర్ఫెక్ట్ లుక్ కోసం ఈమె ప్రతి రోజు కఠినమైన వ్యాయామాలు చేస్తుంది. ఉదయాన్నే వర్క్ అవుట్స్ అనేవి తన దినచర్యలో భాగంగా ఉంటాయి. ఇదిలా ఉంటే ఈ అమ్మడు తాజాగా ఇన్స్టాగ్రామ్ లో ఒక వీడియో షేర్ చేసింది. ఈ వీడియోలో జిమ్ లో ఆమె రెండు వెయిట్ బాల్స్ మధ్య బాడీని బ్యాలెన్స్ చేస్తూ పుష్ అప్స్ తీస్తుంది. నిజానికి ఇలా బాల్స్ మీద బాడీని బ్యాలెన్స్ చేయడం చిన్న విషయం అయితే కాదు. కాని రష్మిక మాత్రం ఆ ఫీట్ కూడా చేసి ఎట్రాక్ట్ చేస్తుంది. ఇక ఈ వీడియోకి అదిరిపోయే విధంగా కొన్ని లైన్స్ కూడా రాసుకొచ్చింది. ఒకప్పుడు ఒక స్ట్రాంగ్ విమెన్ ఉండేది అని నేను ఫ్యూచర్ లో నా గురుంచి చెప్పుకోవాలి. అలాంటి స్ట్రాంగ్ విమెన్ గా ఉండటానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఈ వీడియో. ఒక అమ్మాయిగా ప్రతి ఏదైనా నేను ఇది చూపించాలని అనుకుంటాను. అందులో భాగమే ఇది. క్రేజీగా అనిపించినా కూడా ఏదైనా ఒకటి చేయాలని అనుకుంటే కచ్చితంగా చేసి చూపించొచ్చు. అయితే దాని కోసం ఫోకస్ చేసి గట్టిగా ప్రయత్నం చేయాలి. అలా చేస్తే అనుకున్నది సాధ్యం అవుతుంది అంటూ చిన్న స్టోరీ రాసుకొచ్చింది. ఈ స్టోరీలైన్ కచ్చితంగా ప్రతి ఒక్క అమ్మాయికి స్ఫూర్తినిచ్చే విధంగా ఉందని చెప్పాలి అందుకే ఈ వీడియోకి ఏకంగా 7 లక్షల 83 వేలకి పైగా లైక్స్ వచ్చాయి.

## కొంటె చూపుతో కాటేస్తున్న బేబమ్మ

ఉప్పెన సినిమా తో హీరోయిన్ గా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ కృతిశెట్టి. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే టాలీవుడ్ లో షేక్ చేసిన ఈ అమ్మడు వరుసగా మూడు సినిమాలతో సక్సెస్ లను తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత కాస్త స్లో డౌన్ అయ్యింది. వరుసగా ది వారియర్ మరియు మాచర్ల నియోజకవర్గం సినిమాలు నిరాశపరచడంతో ఈమె రాబోయే సినిమాలపై ఆశలు



పెట్టుకుంది. నాగ చైతన్య ప్రస్తుతం వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటిస్తున్న 'కస్టడీ' సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా వరుసగా నటిస్తున్న ఈ ఉప్పెన క్యూట్ బ్యూటీ స్కిన్ షో విషయంలో కాస్త దూరంగానే ఉంటుంది. మొదటి నుండి కూడా పరిధి దాటి స్కిన్ షో చేయకుండానే వైరల్ అవుతోంది. ఈ అమ్మడు తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. స్కిన్ షో చేయకుండానే ఇలా కొంటె చూపులతో కవ్విస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. క్లీ వేజ్ షో ను కాస్త హెయిర్ తో కవర్ చేసి కవ్వించేలా చూస్తున్న ఈ అమ్మడి ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి ముద్దుగుమ్మ ముందు ముందు కచ్చితంగా స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ గా మారడం ఖాయం అనే టాక్ వినిపిస్తుంది. అందాల విందు విషయంలో ఈ అమ్మడు ఇంకో అడుగు ముందుకు వేయాలని అభిమానులు ఆశ పడుతూ ఉంటే మరి కొందరు మాత్రం ఇలా కొంటె చూపులు చాలు స్కిన్ షో చేసినదానికంటే ఎక్కువ మత్తెక్కిస్తోంది అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు.

## బోల్డ్ లుక్ లో సెగలు రేపుతున్న బిగ్ బాస్ హారిక

దేత్తడి హారికగా యుట్యూబ్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి చేరువ అయిన అందాల భామ అలేఖ్య హారిక. ఈ తెలంగాణ పిల్లకి సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా యుట్యూబ్లో ఈమె చేసిన కంటెంట్ కి చాలా మంది ఫ్యాన్ ఉన్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడిలో మంచి డాన్సర్ కూడా ఉంది. సోషల్ మీడియా ఫేమ్ కారణంగా హారికకి బిగ్ బాస్ రియాలిటీ షోలో పాల్గొనే అవకాశం కూడా లభించింది. ఈ షో ద్వారా మరింత పాపులారిటీ సొంతం చేసుకున్న హారిక టెలివిజన్ రియాలిటీ షోలలో కూడా పాల్గొని తన డాన్స్ యాక్టింగ్ స్కిల్స్ తో అందరిని ఆకట్టుకుంది. ఇదే సమయంలో సినిమాలలో కూడా మంచి అవకాశాలనే దక్కించుకుంది. లీడ్ రోల్స్ కాకుండా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలనే చేసింది. వరుడు కావలెను ఆదిత్యవర్మ శ్రీకారం



సినిమాలలో హారిక నటించింది. ప్రస్తుతం యుట్యూబ్ లో వెబ్ సిరీస్ లు చేస్తుంది. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా చేస్తుంది. ఈ అమ్మడు నటనకి ఎంత మంది ఫ్యాన్స్ ఉన్నారో గ్లామర్ కి కూడా అంతే ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తెలుగమ్మాయి అయినా కూడా ఏ మాత్రం సంకోచం లేకుండా మోడరన్ అవుట్ ఫిట్స్ లో హాట్ ఫోటోలతో సందడి చేస్తుంది. రెగ్యులర్ లో ఈమె తన బోల్డ్ లుక్ తో ఫోటోలని ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తుంది. ట్రెడిషనల్ అండ్ బోల్డ్ లుక్ ఏదైనా కాని హారికకి కరెక్ట్ గా సెట్ అవుతుంది. తాజాగా ఈ అమ్మడు జీన్ షార్ట్ బ్లాక్ టాప్ తో హాట్ అండ్ బోల్డ్ లుక్ లో దర్శనం ఇచ్చింది. ఈ లుక్ కి సంబందించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. హారికలో ఇంత గ్లామర్ ఉందా అనుకునేలా ఆమె ఫోజులు ఇవ్వడం విశేషం. హీరోయిన్ గా ఒక్క సినిమా పడితే హారిక రేంజ్ మారిపోవడం పక్కా అని ఈమె లుక్స్ చూసిన తర్వాత కుర్రాళ్ళు మాట్లాడుకోవడం విశేషం.



# పండుగ వాతావరణంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ : మంత్రి తలసాని

హైదరాబాద్ : వచ్చే నెలలో మృగశిర కార్తె సందర్భంగా ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంది. మత్స్యశాఖ ఆధ్వరంలో జూన్ 8,9,10 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాలలో ఈ ఫెస్టివల్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మత్స్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణకు అనువైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ లో చేపలతో తయారు చేసిన ఫిష్ ఫ్రై, కర్రీ, బిర్యానీ వంటి అన్ని రకాల వంటకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫెస్టివల్ లో 20 నుంచి 30 వరకు వివిధ రకాల చేప వంటకాల స్టాల్స్ ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. ప్రతి చోట విజయ డెయిరీ ఉత్పత్తులతో కూడిన స్టాల్ ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభానికి ఆయా జిల్లాలకు చెందిన మంత్రిని , ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫెస్టివల్ కు వచ్చే వినియోగదారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. రాష్ట్ర పండుగను తలపించే విధంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ అధికారులతో పాటు గోపాలమిత్ర లకు కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. అదేవిధంగా మత్స్యరంగానికి విశేష సేవలు అందించిన వారిని గుర్తించి సన్మానించాలని తెలిపారు. నూతనంగా లక్ష మందికి మత్స్య సొసైటీ లలో సభ్యత్వాలు కల్పించే విధంగా స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణ, ఏర్పాట్లపై పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఆధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా పాల్గొన్నారు. నూతనంగా మత్స్య సహకార సంఘాల సొసైటీ చైర్మన్ గా నియమితులైన పిట్టల రవీందర్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈటల రాజేందర్ ఢిల్లీ వెళితే తప్పేంటి?..




హైదరాబాద్: బీజేపీలో అంతా బాగానే ఉందని.. జాతీయ నాయకులకు కలవటానికి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఢిల్లీ వెళితే తప్పేంటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అగ్రనేతలను ఎవరైనా.. ఎప్పుడైనా కలవొచ్చని స్పష్టం చేశారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలకు, తెలంగాణ ఎన్నికలకు సంబంధమే ఉండదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే.. దేశమంతటా గెలిచినట్లు హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. కర్నాటక ఎన్నికలకు తెలంగాణ సీఎం కేసీఆర్ డబ్బులు పంపించారని, కాంగ్రెస్ బలంగా ఉంటే.. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడులో ఆ పార్టీకి డిపాజిట్ కూడా ఎందుకు రాలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. కేంద్రంతో పాటు.. 18 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని లేపటానికి బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోందని, సొంత డప్పు కొట్టుకోవటానికి వేల కోట్ల ప్రజా ధనాన్ని సీఎం కేసీఆర్ ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. 21 రోజుల ఉత్సవాల పేరుతో వందల కోట్లు యాడ్స్ రూపంలో సొంత వారికి అప్పజెబుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో 30 శాతం కమిషన్ ఉందని సీఎం స్వయంగా చెప్పారని అన్నారు. ఎమ్మెల్యే రాజసింగ్ ధర్మ రక్షకుడని.. ఆయన సస్పెన్షన్ విషయంలో త్వరలో మంచి నిర్ణయం వస్తుందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ప్రజలు ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పేదలకు పక్కా ఇళ్ళు కట్టిస్తామని, పేదలు చదువుకునే విధంగా క్వాలిటీ విద్యతో పాటు.. మంచి వైద్యం అందిస్తామన్నారు. కేసీఆర్ హయాంలో మద్యంపై రూ. 40 వేల కోట్ల ఆదాయం వస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తామన్నారు. కాగా అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ. పది వేలు ఇవ్వాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# దశాబ్దిలోనే శతాబ్ద కాలంలో చేయాల్సిన పనులు చేసి చూపించాం : మంత్రి జగదీశ్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణలో దశాబ్ద కాలంలోనే శతాబ్ద కాలంలో చేయాల్సిన పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష, పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నిర్వహణతో పాటు పలు కీలక అంశాలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ పార్టీ చేయని అద్భుతాలు, విజయాలను ఈ పదేండ్ల కాలంలోనే బీఆర్ఎస్ పార్టీ సాధించిందని తెలిపారు. ఇప్పటి వరకు చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలను పార్టీ పరంగా కార్యకర్తల ద్వారా ప్రజలకు వివరించాలి. అనేక రంగాల్లో అద్భుతమైన విజయాలు సాధించిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కేంద్ర మంత్రులతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశంసలు కురిపించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మన పార్టీ విజయాలను తప్పకుండా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి జగదీశ్ రెడ్డి. విద్యుత్ రంగంలో గుజరాత్‌లో ఇవాల్టికి కోతలు ఉన్నాయి. ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదు. దేశంలోనే తొలి సారిగా రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందన్నారు. నీటి విషయంలో మన రాష్ట్రంలో భూగర్భ జలాలు ఉబికి వస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వ్యవసాయ రంగంలో దేశమంతా ఇబ్బంది పడుతుంటే.. తెలంగాణలో మాత్రం వ్యవసాయాన్ని పండుగలా మార్చాం. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. ప్రతి ఒక్కరికి చేరువయ్యాం. దేశంలోని పలు రాష్ట్రాల ప్రజలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంది. కానీ తెలంగాణలో ఏ ఒక్కరూ కూడా ఆకలితో బాదపడటం లేదు. అందరి ఆకలి తీర్చాం. దశాబ్ద కాలంలోనే శతాబ్ద కాలంలో చేయాల్సిన పనులు చేసి చూపించాం. ఈ విషయాలన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించినట్లు మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ కార్పోరేషన్‌ల చైర్మన్‌లు హాజరయ్యారు.

# ఇతర రాష్ట్రాల మద్యం తెలంగాణలో అమ్మడం నేరం : మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ : తెలంగాణలో ఇతర రాష్ట్రాలకు సంబంధించిన మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గత వారం రోజుల నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన 1330 మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. గోవా, హర్యానా నుంచి లేబుల్స్ లేని మద్యం బాటిళ్లను ఇక్కడికి అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు.

అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల మద్యం రాష్ట్రంలో అమ్మడం నేరం అని మంత్రి స్పష్టం చేశారు. డిపోల నుంచి సరఫరా అయిన మద్యం మాత్రమే సురక్షితమైందని మంత్రి పేర్కొన్నారు. మద్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా చాకచక్యంగా వ్యవహరించిన ఎక్సైజ్ అధికారులను మంత్రి అభినందించారు.

# 'బలగం' మొగిలయ్యకు 'దళితబంధు' పథకం కింద కారు పంపిణీ..

హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఎల్లవేళలా దళితులకు అండగా ఉంటుందని, ఇందుకు నిదర్శనమే బలగం సినిమాలో పాటలు పాడిన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు దళిత బంధు పథకం కింద కారు పంపిణీ చేయడమేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బలగం సినిమాలో తమ పాట ద్వారా ప్రేక్షకులను మెప్పించిన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు తెలంగాణ ప్రభుత్వం తరపున దళిత బంధు పథకం కింద రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కారును అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, సుంకె రవిశంకర్, జోగినపల్లి శ్రీనివాసరావు, బేడ బుడగ జంగాల జేఏసీ చైర్మన్ టి.జగదీశ్వర్, వైస్ చైర్మన్ చింతల యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితులందరు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. మూడేండ్లలో దళితులందరికీ దళిత బంధు ద్వారా ఆర్థిక సాయం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం కేసీఆర్ మనసున్న మహారాజు. అందుకే అందరి క్షేమం కోసం ఆలోచిస్తూ, పరిపాలన సాగిస్తున్నారని, దళితులంతా ఆయనకు అండగా నిలవాలని మంత్రి కోరారు. బలగం సినిమాలో అద్భుతంగా పాట పాడి అందరినీ ఆకట్టుకున్న మొగిలయ్య, కొమురమ్మలకు కేసీఆర్ అండగా నిలిచారన్నారు. మొగిలయ్య ఆరోగ్యం బాగు కోసం నిమ్స్‌లో చేర్పించి వైద్యం చేయిస్తున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం మానవత్వమున్న ప్రభుత్వమని మంత్రి తెలిపారు.




భానుడి భగభగలకు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వేసవితాపం తీవ్రతకు వడదెబ్బ బారిన పడుతున్నవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వడదెబ్బ బాధితుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన సూచనలను ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస రావు వివరించారు.

# పశు వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా : మంత్రి తలసాని



హైదరాబాద్ : పశు వైద్యుల సమస్యలను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో వీఏఎస్‌ల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. పరిపాలనా సౌలభ్యం కోసం నూతన జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటు చేసినందు వల్ల అందుకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని సూచించారు. దీని ద్వారా జీవాలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు. పశుసంవర్ధక శాఖను పునర్వ్యవస్తీకరణ చేపడితే అనేక పోస్టుల ఏర్పాటు జరుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి పదోన్నతులు లేని తమకు పదోన్నతుల అవకాశం లభిస్తుందని చెప్పారు. జీహెచ్ఎంసీలో మాదిరిగా రాష్ట్రంలోని మున్సిపాలిటీ లలో వీధి కుక్కలు, కోతుల బెడద నివారణ, వాటికి అవసరమైన వైద్య సేవలు అందించడం, పర్యవేక్షణ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి మాట్లాడుతూ శాఖ లోని వైద్యులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టవలసిన చర్యలపై అధ్యయనం చేసి నివేదికను అందజేయాలని పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ని మంత్రి ఆదేశించారు. నివేదికను సమర్పించిన అనంతరం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, వీఏఎస్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ గౌడ్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి, ట్రెజరర్ ధర్మా నాయక్, తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, జనరల్ సెక్రెటరీ మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య తెలంగాణ కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ : రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం పల్లె, బస్తీ దవాఖానాలు ప్రారంభించిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని పద్మనగర్ లో రూ. 21.30 లక్షలతో ఏర్పాటుచేసిన బస్తీ దవాఖానాను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సత్వర వైద్యసహాయాన్ని అందించేందుకు పల్లె, బస్తీ దవాఖానాలను ఏర్పాటుచేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అంటేనే భయపడే రోజులుండేవని, ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్యం అందుతుందని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడిందని వెల్లడించారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రతి 10వేల మందికి ఒక బస్తీ దవాఖానాను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్, ఒక నర్స్‌తోపాటు, మందులు, రోగనిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. బస్తీ దవాఖానాను ప్రారంభించిన అనంతరం మంత్రి, మేయర్ వైద్యపరీక్షలను చేయించుకున్నారు. అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, మేయర్ వై. సునీల్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి లలితాదేవి, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, గందే మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, మున్సిపల్ కమీషనర్ సేవా ఇస్లావత్, తహసీల్దార్ వెంకట్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవ ఆఫర్.. ఈ-గరుడ బస్సు ఛార్జీల తగ్గింపు వివరాలివే




హైదరాబాద్: వాయు కాలుష్యాన్ని నివారించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ప్రారంభించిన విషయం తెలిసిందే. హైదరాబాద్-విజయవాడ రూట్‌లో 'ఈ-గరుడ' పేరుతో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నారు. కొత్త బస్సుల ప్రారంభం సందర్భంగా నెల రోజుల పాటు ఈ-గరుడ బస్సుల్లో ఛార్జీలు తగ్గిస్తున్నట్టు రంగారెడ్డి రీజియన్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. మియాపూర్ నుంచి విజయవాడకు రూ. 830గా నిర్ణయించిన ధరను రూ. 760కి, ఎంజీబీఎస్ నుంచి విజయవాడకు రూ. 780గా ఉన్న టికెట్ ధరను రూ. 720కి తగ్గిస్తూ ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. హైదరాబాద్-విజయవాడ మార్గంలో మంగళవారం పది బస్సులను ప్రారంభించగా.. దశలవారీగా 50 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. మిగతా బస్సులను ఈ ఏడాది చివరి నాటికి తీసుకొచ్చేలా సంస్థ ప్రణాళిక రూపొందించింది. ఇవి వస్తే ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని ఆర్టీసీ చెబుతోంది.

**బస్సులు బయలుదేరు వేళలు..** మియాపూర్ నుంచి : 6:25, 8:25, 10:25, 18:05, 19:45, 21:45 గంటలకు ఈ-గరుడ బస్సులు బయలుదేరుతాయి. ఎంజీబీఎస్ నుంచి : 8:10, 10:10, 12:10, 19:50, 21:30, 23:30 గంటలకు ఈ-గరుడ బస్సులు బయలుదేరుతాయి. విజయవాడ నుంచి : 6:20, 8:00, 10:00, 18:40, 20:40, 22:40 గంటలకు ఈ-గరుడ బస్సులు బయలుదేరుతాయి.

# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే సీఎం క్రీడా కప్ లక్ష్యం: మంత్రి శ్రీనివాస్ గౌడ్



జడ్చర్ల: గ్రామీణ స్థాయిలో ప్రతిభగల క్రీడాకారులను వెలికి తీయడమే లక్ష్యంగా సీఎం క్రీడా కప్ పోటీలను నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ఈ క్రీడా కప్ పోటీలను ప్రారంభించారని అన్నారు.

జడ్చర్ల మండల కేంద్రంలో జరుగుతున్న మండల స్థాయి సీఎం క్రీడా కప్ ముగింపు పోటీలను మంత్రి తిలకించారు. మంత్రితోపాటు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కూడా ఉన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయికి వెళ్తారని మంత్రి పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గం నుంచి అత్యధిక స్థాయిలో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com